



# విజయభాను






విశాఖపట్నం, ఆదివారం 14-01-2018 VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION సంపుటి : 41 సంచిక : 122 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## బాబు పాలనలో అభివృద్ధి శూన్యం

**చంద్రగిరికి బాబు ఏం చేశారు? .. సొంతవూరు ఉండాల్సిన స్థితి ఇదా?**

**రైతులను ఆదుకోలేదు.. ఎక్కడి గొంగళి అక్కడే**

**చంద్రగిరి ప్రజాసంకల్పయాత్రలో వైఎస్ జగన్**



చిత్తూరు : సొంతగడ్డ చంద్రగిరి నియోజకవర్గానికి చంద్రబాబు నాయుడు ఏం చేశారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ప్రజాసంకల్పయాత్రలో భాగంగా చిత్తూరు జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని రామచంద్రాపురంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

చంద్రగిరి నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టింది ఈ నియోజకవర్గంలోనే. ఆశ్చర్యం ఏంటో తెలుసా. 1978లో ఇదే చంద్రబాబు ఇక్కడి నుంచి పోటీ చేశారు. 2 వేల ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికయ్యాడు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీలో ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి చలవతో మంత్రి కూడా అయ్యాడు.

మంత్రి అయి ఐదేళ్లు పరిపాలన చేశాడు. మళ్లీ 1983లో ఎన్నికలు జరిగాయి. మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇదే చంద్రగిరి నుంచి బరిలోకి దిగితే 17,500 ఓట్లతో ఓటమి పాలయ్యాడు. ఇదే చంద్రగిరి నియోజకవర్గాన్ని చూడండి. సొంతవూరికి ఏదైనా చేయాలని కాస్తోకూస్తో గొప్పగా సెటిల్ అయిన ప్రతి ఒక్కరూ ప్రయత్నిస్తారు. విదేశాల్లో ఉన్న ఎన్నారైలు కూడా సొంత గడ్డకు ఏదైనా చేయాలని తపన పడతారు. డబ్బు పంపించి అభివృద్ధికి పాటుపడతారు.

అలాంటిది 13 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు సొంతవూరు ఉండాల్సిన స్థితి ఇదా?. తరువాయి 2లో

## ఏంటీగొడవ?

- పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు
- తేదేపా-బీజేపీ నేతల వివాదంపై బాబు సీరియస్
- వివాదాలపై విచారణకు కమిటీ ఏర్పాటు
- ముఖ్యనేతలతో తన నివాసంలో సమావేశం



హైదరాబాద్: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో తెలుగుదేశం - భారతీయ జనతా పార్టీ నేతల వివాదంపై చంద్రబాబు సీరియస్ అయ్యారు. జడ్పీ ఛైర్మన్ బాపిరాజు, ఇతర తెదేపా నేతల వ్యాఖ్యలపై ఆయన ఆరా తీశారు.

శనివారం ఉదయం తన నివాసంలో పార్టీ ముఖ్యనేతలతో సమావేశమైన చంద్రబాబుకు పార్టీ నేతలు కొందరు ఈ వివాదం అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ వివాదంపై విచారణకు మంత్రులు పత్తిపాటి పుల్లారావు, కొల్లు రవీంద్ర, పిఠాపురం ఎమ్మెల్యే వర్మతో కమిటీ ఏర్పాటు చేశారు.

పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని నేతలను హెచ్చరించారు. బాపిరాజుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన చంద్రబాబు ఇప్పటికే బాపిరాజు అనేకసార్లు క్రమశిక్షణ ఉల్లంఘించారని ఆయన మండిపడ్డారు. బాపిరాజు వ్యవహారశైలి మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ వ్యవహారంపై సాధ్యమైనంత త్వరగా నివేదిక ఇవ్వాలని చంద్రబాబు ఆదేశించారు.



## జోరుగా కోడిపందేలు

- భారీ ఎత్తున పోలీసుల దాడులు
- 500 మందిపై బైండోవర్లు

ఏలూరు: పశ్చిమ గోదావరి జిల్లాలో జోరుగా జరుగుతున్న కోడిపందేలపై పోలీసులు దాడులు చేపట్టారు. జిల్లాలోని ఏలూరు డివిజన్, దెందులూరు, ఏలూరు రూరల్ మండలాల్లో శనివారం భారీ ఎత్తున దాడులు నిర్వహించి కోడిపందేల బరులను ధ్వంసం చేశారు. పందేలను నిలువరించేందుకు ఏపీఎస్పీకి చెందిన తరువాయి 2లో

## కన్నడ విద్యార్థినిగా చిన్నమ్మ

**జైలులోనే అడల్ట్ లిటరసీ కార్యక్రమం**

**కంప్యూటర్ తరగతులకూ ఆమె హాజరు**

**జైలు అధికారుల వెల్లడి**



బెంగళూరు: అక్రమాస్తుల కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి చిన్నమ్మ శశికళ విద్యార్థినిగా మారిపోయారు. జైల్లో ఆమె కన్నడ నేర్చుకుంటున్నారు. పరప్పణ తరువాయి 2లో


## డ్రగ్స్ ముఠా అరెస్ట్

**20లక్షలు విలువ చేసే డ్రగ్స్ స్వాధీనం .. ముఠాలో ఎనిమిదిమంది సభ్యులు**

**డీసీపీ పద్మజా వెల్లడి**

హైదరాబాద్: కడప నుంచి హైదరాబాద్‌కు మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్న ఎనిమిది మంది ముఠా సభ్యులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఎనిమిది మంది నిందితులు కడప, అనంతరపురం జిల్లాలకు చెందిన వారుగా గుర్తించారు. నిందితుల నుంచి రూ. 20లక్షలు విలువ చేసే కిలో జీహెచ్‌బీ డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతపురం జిల్లా ఎల్లనూరుకు చెందిన దాసరి బాబు డ్రగ్స్ కేసులో ప్రధాన నిందితుడని శంషాబాద్ డీసీపీ పద్మజా వెల్లడించారు. దాసరి బాబుపై గతంలో తాడిపత్రిలో ఓ వర్గంపై బాంబులు వేసిన కేసు, కడపలో ఎర్రచందనం స్మగ్లింగ్, రద్దయిన నోట్ల చెలామణి, దొంగతనం కేసులు ఉన్నాయని ఆమె చెప్పారు. నిందితుడు ఎక్కువగా కడప నుంచి తరువాయి 2లో





## కూలిన హెలికాప్టర్

**ముగ్గురి మృతదేహాలు లభ్యం**



ముంబై : ఏడుగురితో వెళ్తోన్న ఓ హెలికాప్టర్ అదృశ్యమైంది. ముంబై తీరానికి 30 నాటికల్ మైళ్ల దూరంలో తరువాయి 2లో






## ఈ-మైగ్రేట్‌లో రిజిస్టర్ చేసుకోకుంటే అంతే!



**అక్రమ ఏజెంట్లకు ప్రభుత్వం హెచ్చరిక**

హైదరాబాద్: విదేశాలకు పంపిస్తామని చెప్పి అమాయకుల్ని మోసం చేసే అక్రమ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు మంత్రులు కేటీఆర్, నాయిని నర్సింహారెడ్డి తెలిపారు. ఈ-మైగ్రేట్‌లో రిజిస్టర్ చేసుకునేందుకు ఏజెంట్లకు నెల రోజుల సమయం ఇస్తున్నట్లు చెప్పారు. ఈలోగా నమోదు చేసుకోకపోతే వారందరిని అక్రమ ఏజెంట్లుగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రిజిస్టర్ చేసుకోని అక్రమ ఏజెంట్లపై కేసులు నమోదు చేయడంతోపాటు పదే పదే అక్రమాలకు పాల్పడుతున్న ఏజెంట్లపై పీడీ చట్టం పెట్టాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నారై శాఖపై శనివారం మంత్రులు కేటీఆర్, నాయిని సమీక్షించారు. అక్రమ ఏజెంట్లపై చర్యలు తీసుకునే విషయంలో తరువాయి 2లో

# యువతవల్లే సమాజాభివృద్ధి



పిఠాపురం : యువకుల వల్లే సమాజాభివృద్ధి జరుగుతుందని పిఠాపురం మున్సిపల్ చైర్మన్ కరణం చిన్నారావు పేర్కొన్నారు. పిఠాపురం పట్టణంలో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కత్తులగూడెం గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఉప్పాడ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కత్తులగూడెంలో జరిగిన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కరణం చిన్నారావు మాట్లాడుతూ యువత వివేకానందుని ఆదర్శం గా తీసుకోవాలని పిలుపు నిచ్చారు. యువకుల వల్ల సమాజాభివృద్ధి సాద్యమని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లు దూరంగా ఉండాలని కోరారు. వైస్‌చైర్మన్ పిల్లి చిన్న మాట్లాడుతూ యువతరం ఎక్కువ ఉన్న దేశం మనదేనని యువత సమాజంలో జరుగుతున్న అన్యాయా లపై పోరాడాలని పిలుపునిచ్చారు. అలాగే ఆర్ ఆర్ బీ హెచ్ ఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణా రావు మాట్లాడుతూ విద్యాబాస్యం నుంచే యువత సరైన రీతిగా ప్రవర్తించాలన్నారు. విద్యను సక్రంగా అభ్యసిస్తే చక్కని భవిష్యత్ ఏర్పడుతుం దన్నారు.

ఈ సందర్భంగా 19వ వార్డు కౌన్సిలర్ చేతుల మీదుగా దుస్తులను పంపిణీ చేశారు. అలాగే ముగ్గుల పోటీల విజేతలకు కరణం చిన్నారావు, పిల్లి చిన్నలు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.

# క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



రాజమహేంద్రవరం : రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు అధిక ప్రాధాన్యమిస్తూ ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నిమ్మ కాయల చినరాజప్ప తెలిపారు. రాజమహేంద్ర వరం టౌన్‌హాలులో గురువారం అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడలో ఇటీవల బహుమతి సాధించిన ఆచంట ఉమేష్‌కుమార్ అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చినరాజప్ప మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగరంలో క్రీడలకు 30 ఎకరాల భూసేకరణకు ముఖ్యమంత్రి అనుమతులిచ్చారని, త్వరలో భూసేకరణ చేసి అన్ని సౌకర్యాలతో క్రీడా ప్రాంగణాలను నిర్మిస్తామన్నారు. తల్లిదండ్రులు పిల్లల్లో క్రీడాసక్తిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ క్రికెట్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చిన విద్యార్థులు ఇప్పుడు అన్నిరకాల క్రీడల్లోనూ ప్రతిభచూపటం స్వాగతించవలసిన విషయమ న్నారు. వీరేశలింగం పురమందిరం అభివృద్ధి విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడా చైర్మన్ గన్ని కృష్ణ మాట్లాడుతూ టౌన్‌హాలు టీటీ క్రీడకు దేవాల యం వంటిదని, ఇక్కడి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించ టం ఆనందంగా ఉందన్నారు. టౌన్‌హాలు ఎదురుగా ఉన్న స్థలంలో ప్రస్తుతం క్రీడాకారులు సాధన చేస్తున్నారని, ఆ స్థలాన్ని టీటీ అసోసియేషన్‌ను అందించాలని చినరాజప్పను కోరారు. నగర మేయర్ పంతం రజనీశేషసాయి మాట్లాడుతూ క్రీడాకారులు ఉమేష్‌ను ఆదర్శం గా తీసుకుని రాణించాలన్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ యర్రా వేణుగోపాల రాయుడు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశ రావు, దొండపాటి సత్యంబాబు, ఆకుల వీర్రాజు, ఆదిరెడ్డి వాసు, కార్పొరేటర్లు, తపాలా శాఖ అధికారులు, టీటీ కోచ్‌లు పాల్గొన్నారు.

## యువత ఆదర్శంగా నిలవాలి

పెద్దాపురం : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో యువత కృషి చేయాలని తద్వారా మిగిలిన వారందరికీ ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని గోరింట గ్రామంలో జీడివై యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కార్తికేయమిశ్రా ముఖ్యఅతిథిగా హాజరై యువతకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రూ.5లక్షల వ్యయంతో గ్రామానికి రెండువె%పులా ఏర్పాటు చేసిన మొక్కల ప్లాంటేషన్‌ను చినరాజప్ప ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలను ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. సమాజం పట్ల యువత బాధ్యత కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీవో కుమార్, ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఎంపీపీ జి.రమేష్, ఏఎంసీ ఛైర్మన్ ఎం.రాజబ్బాయి, ఎంపీడీవో వసంత మాధవి పాల్గొన్నారు.

# సింహగిరిపై సంక్రాంతి సంబరాలు

సింహాచలం : శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి కొలువై ఉన్న సింహగిరిపై సింహాచల దేవస్థాన అద్వర్యంలో 14 న భోగిరోజున సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా జరపడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని ఈఓ కె .రామ చంద్రమోహన్ తెలిపారు .

సంక్రాంతి సంబరాలలో భాగంగా కొండపైన గ్రామీణ వాతా వరణం ప్రతిబింబించే విధంగా గడ్డితో పాకలు వేసి గొబ్బెమ్మలతో ముగ్గులు , చెరుకు గడలతో జాలువాలు, పువ్వులతో అలంకరణ చేసి గంగి రెద్దులతో, డూడూ బసవన్నలతో, హరి దాసు కీర్తనలతో కొమ్మదాసరి వేషధారణలతో కపిలగోవు కపిల గిత్తతో ఎడ్ల బండి పూసి అత్యంత వైభవంగా జరపనున్నారు. వేదం మంత్రార్చనలతో గోవు పూజ జరుపబడును అని ముగ్గుల పోటీలు నిర్వహించ బడును అని పాల్గొన దలచిన వారు అదివారం ఉ :6 గం ల నుండి 8 :30 లొపున రాజగోపురం ఎదురు రోడ్ పై ముగ్గులు గొబ్బెమ్మలు వేసి పోటీ లో పాల్గొన వచ్చునని. అలాగె బోగి రోజున చిన్న పిల్లలకు భోగి పళ్ళు కార్యక్రమము జరపబడును అని పాల్గొన దలచిన వారు బోగి రోజున ఉ 9 గం లకు పిల్లలతో హాజరు కావాలని కోరారు . బోగి రోజున గ్రామ ప్రజలు, భక్తులు స్వామి దర్శనం చేసుకొని సంక్రాంతి సంబరాలలో పాల్గొనవలసిందిగా కోరారు. 16 న కనుమ రోజున కృష్ణాపురం గోశాలలో గోపూజ నిర్వహించబడును అని పాల్గొను వారికి క్రింద బస్సు స్టాండ్ నుంచి గోశాలకు బస్ సౌకర్యం ఏర్పటు చేశామని ఈ సౌకర్యాన్ని భక్తులు వినియోగించి కోవాలి అని ఈ ఓ రామచంద్రమోహన్ విజ్ఞప్తి చేశారు.

## 16న గజేంద్రమోక్ష ఉత్సవం, 17న తెప్పోత్సవం



సింహాచలం : శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా స్వామి వారి గజేంద్రమోక్షం ఉత్సవాన్ని కనుమ రోజున సింహగిరి దిగువున గల స్వామి వారి పూలతోటలో సాయంత్రం నిర్వహించనున్నారు గజేంద్ర మోక్షం కార్యక్రమం తరువాత తిరువీధి కార్యక్రమం జరప బడును అని . అలాగె స్వామివారి పుష్య బహుళ అమావాశ్య రోజున అనగా 17 వ తేదీన బుధవారం స్వామి వారి తెప్పోత్సవమ్ సాయంత్రం స్వామి వారి వరహ పుష్కరిణిలో అత్యంత వైభవంగా జరుపుటకు ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారి తెప్పోత్సవం అనంతరం తిరువీది ఉత్సవం జరపబడును . అలాగె భక్తులకు మంగళవారం ,బుదవారం స్వామి వారి దర్శనం సాయంత్రం 6 గం ల వరకు మాత్రమే లభించును అని తెలిపినారు పై రెండు కార్యక్రమములుకు గ్రామ ప్రజలు భక్తులూ పాల్గొని స్వామి వారి తీర్ధప్రసాదం స్వీకరించి స్వామీ కృప పొందవలెనని కొరారు.

## హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు



రామచంద్రపురం : రామచంద్రపురం కృత్తివెంటి క్రీడా ప్రాంగణం వేదికగా జరుగుతున్న 6వ జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో బాలుర జట్లు నువ్వానేనా అన్నట్లు హోరాహోరీగా తలపడు తున్నాయి. పురుషుల విభాగంలో విజయనగరం జట్టుపై రామ చంద్రపురం-బి జట్టు, కాకినాడ ఏపీఎస్పీ జట్టుపై రామ చంద్రపురం-ఎ జట్టు, ఏపీ పేపరు మిల్లు రాజమహేంద్రవరం జట్టుపై ఏపీ యూత్ జట్టు, రాజమహేంద్రవరం ఆర్బీఏ-బి జట్టుపై కర్నూలు డీఎస్ఏ-ఎ జట్టు, విజయవాడ సీబీఏ జట్టుపై జి.మామిడాడ జట్టు, గుంటూరు ఎన్టీఆర్ జట్టుపై విజయవాడ సీబీఏ జట్టు, సీబీఏ రాజమహేంద్రవరం జట్టుపై భోపాల్ ఈఎంఈ జట్టు, వైజాగ్ ఎన్ఎస్ఏ జట్టుపై ఆర్బీఏ రాజమహేంద్రవరం జట్టు, రామచంద్రపురం-డి జట్టుపై రాజమహేంద్రవరం సీబీఏ-ఎ జట్టు, ముమ్మిడివరం జట్టుపై హైదరాబాద్ హూప్‌స్టార్ జట్టు, కొత్తపేటపై కాకినాడ ఏపీఎస్పీ రేంజ్ జట్టు, మార్టేరుపై సామర్లకోట జట్టు, గుడివాడ జట్టుపై యానాం జట్టు విజయం సాధించాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, గన్నమని చక్రవర్తి తెలిపారు. మహిళా విభాగంలో పోటీలు ప్రారంభించలేదని వారు చెప్పారు.

**మొదటి పేజీ తరువాయి**

## డ్రగ్స్ ముఠా అరెస్ట్

ఈ మాదకద్రవ్యాలను బెంగుళూరుకు సరఫరా చేసే వాడని పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని కొన్ని క్లబ్‌లకు మాదకద్రవ్యాలను సరఫరా చేయడానికి యత్నిస్తుంటే పక్కా సమాచారంతో అరెస్టు చేశామని డీసీపీ తెలిపారు. వీరి వెనుక ఎవరున్నారనే దానిపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తామన్నారు.

## జోరుగా కోడిపందేలు

బెటాలియన్‌ను కేటాయించినట్టు డీఎస్పీ ఈశ్వరరావు తెలిపారు. ఏలూరు డివిజన్‌లో 500 మందిపై బైండోవర్ కేసులు, 700 మందిపై కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు. కోడి పందేలను అరికట్టడానికి 67 పికెట్స్.. 10 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్టు ఆయన పేర్కొన్నారు. పందేలపై అనుమతి లేదని అనధికారకంగా కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈశ్వరరావు స్పష్టం చేశారు.

## కూలిన హెలికాప్టర్

ఏటీసీతో హెలికాప్టర్ సంబంధాలు తెగిపోయాయి. హెలికాప్టర్‌లో ఓఎన్జీసీ సిబ్బంది కూడా ఉన్నారు. శనివారం ఉదయం 10.20 నిమిషాలకు జూహూ నుంచి హెలికాప్టర్ టేకాఫ్ తీసుకున్నది. ఓఎన్జీసీకి చెందిన నార్త్ ఫీల్డ్‌లో ఆ హెలికాప్టర్ 10.58 నిమిషాలకు చేరుకోవాల్సి ఉంది.

ఇండియన్ నేవీకి చెందిన స్టీల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ టెగ్ సహాయక చర్యల్లో పాల్గొన్నది. నిఘా విమానం పీ8ఐ కూడా గాలింపు కొనసాగించినట్లు అధికారులు తెలిపారు. నేవీతో పాటు కోస్టుగార్డులు సహాయక చర్యలు కొనసాగించినట్లు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ తెలిపారు. తాను కూడా ముంబై వెళ్లినట్లు ఆయన చెప్పారు. రక్షణ మంత్రితో ఈ అంశాన్ని చర్చిస్తామని, నేవీ-కోస్టు గార్డులు చర్యలు మొదలుపెట్టాలని రక్షణ మంత్రి కూడా ఆదేశించారని మంత్రి తెలిపారు. ఓఎన్జీసీకి చెందిన పవన్ హన్స్ హెలికాప్టర్ గల్లంతు అయిన విషయం తెలిసిందే.

హెలికాప్టర్‌లో అయిదుగురు ఓఎన్జీసీ సిబ్బందితో పాటు ఇద్దరు పైలట్లు ఉన్నారు. అయితే కోస్టు గార్డు సిబ్బంది ఇప్పటికి ముగ్గురి మృతదేహాలను కనుగొన్నారు. అందులో ఓ సీనియర్ ఓఎన్జీసీ ఆఫీసర్ ఉన్నారు. ఛాపర్‌కు చెందిన శిథిలాలు కూడా కనుగొన్నట్లు తెలుస్తున్నది. అయితే మిగతా ప్యాసింజెర్ల కోసం గాలింపు చేపడుతున్నట్లు కోస్టు గార్డులు తెలిపారు. వీటీపీడబ్ల్యే డౌఫిన్ ఏఎస్ 365ఎన్3 హెలికాప్టర్ శనివారం ఉదయం ప్రమాదానికి గురైంది. ముంబై నుంచి 30 నాటికల్ మైళ్ళ దూరంలో ఈ దుర్ఘటన జరిగింది.

## ఈ-మైగ్రేట్‌లో రిజిస్టర్ చేసుకోకుంటే అంతే!

పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. హైదరాబాద్ నగరంలో విదేశీ భవన్‌కు ఫిబ్రవరి రెండో వారంతో శంకుస్థాపన చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలని అధికారులతో అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నారైలు వలస కార్మికుల కోసం చేపడుతున్న చర్యలు, ప్రభుత్వ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేయాలన్నారు. గల్ఫ్‌కు మహిళల అక్రమ రవాణాపైన మరింత కఠినంగా వ్యవహరించాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఈ విషయంలో మైనార్టీ సంక్షేమ, కార్మిక, ఎన్నారై, పోలీసు శాఖలు ఉమ్మడి బృందాల ఏర్పాటు చేయాలని మంత్రులు ఆదేశించారు.

## కన్నడ విద్యార్థినిగా చిన్నమ్మ

అగ్రహారంలోని సెంట్రల్ జైలులో ఖైదీల కోసం ప్రత్యేకంగా అడల్ట్ లిటరసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే కన్నడ భాష రాయడం, చదవడం నేర్పిస్తున్నారు. ఈ తరగతులకు శశికళ కూడా హాజరవుతున్నట్లు జైలు అధికారులు చెబుతున్నారు. అంతేకాదు.. కంప్యూటర్ తరగతులకు కూడా ఆమె హాజరువుతున్నారట.

ఇదే జైలులో ఉన్న శశికళ బంధువు జె.ఇళవరసితో కలిసి కన్నడ నేర్చుకుంటున్నట్లు సిబ్బంది తెలిపారు. అయితే.. కన్నడ మాట్లాడటం మాత్రం రాలేదని.. కానీ ఆమె బాగా రాయగలుగుతున్నారట. ఈ తరగతులకు హాజరైన వారికి శిక్షణ ముగిసిన తర్వాత ధ్రువీకరణ పత్రాలు అందజేయడం జరుగుతోంది. పుస్తకాలు చదవడంపై కూడా శశికళ ఆసక్తి చూపిస్తున్నట్లు జైలు లైబ్రరీ సిబ్బంది తెలిపారు. ఇప్పటి వరకు అక్కడ కేవలం పురుషులకు మాత్రమే గ్రంథాలయం ఉంది. మహిళల కోసం జైలులో ప్రత్యేకంగా లైబ్రరీని ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## బాబు పాలనలో అభివృద్ధి శూన్యం

చిన్నవయసులో చంద్రబాబు నారావారిపల్లె పక్కన ఉన్న శేషాపురం స్కూల్‌లో చదువుకున్నారు. ఇవాల్టికి కూడా ఈ స్కూల్‌కు పిల్లలు వెళ్తున్నారు. గట్టిగా తుమ్మితే పడిపోయే దుస్థితిలో పాఠశాల ఉంది. ముఖ్యమంత్రి చదువుకున్న స్కూల్ పరిస్థితి ఇలావుంటే.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మిగతా స్కూళ్ల పరిస్థితి ఏంటి?

వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు చంద్రగిరిలో వంద పడకల ఆసుపత్రి నిర్మించడం కోసం జీవోను జారీ చేశారు. ఆ తర్వాత దురదృష్టం వల్ల మన మధ్య నుంచి వెళ్లిపోయారు. ఇప్పటికీ జీవో ఉంది. కానీ, చంద్రబాబు దాన్ని పట్టించుకోరు. చంద్రగిరి నియోజకవర్గంలో మొత్తం 138 పంచాయితీలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో 70 శాతం తాగునీరు కొరత ఉంది.

దీన్నిబట్టి చంద్రబాబు పరిపాలన ఎలా ఉందో తెలుస్తుంది. ప్రతి ఏటా చంద్రగిరిలోని కొన్ని మండలాల్లో ఏనుగులు బీభత్సం చేస్తూ ఉంటాయి. కనీసం ఒక్కసారైనా పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు చంద్రబాబు దమ్మిడి సాయం చేశాడా? అని ప్రశ్నించారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం



విశాఖపట్నంః లయన్స్ క్లబ్ నార్త్ ఈస్ట్ కమిటీ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో సేవాసంస్థ లయన్స్ క్లబ్‌ను స్థాపించిన దివంగత మెల్విన్ జోన్స్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ మహా నగరంలో గల వివిధ ఆశ్రమాల్లోనూ సేవా సంస్థల్లోనూ అన్నదాన కార్యక్రమాన్ని గత 12 రోజులుగా నిర్వహించినాము.

ఈ 13వ రోజున డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో గల బాలబాలికలకు, వృద్ధులకు అన్న ప్రసాద వితరణ (నారాయణ సేవ) నిర్వహించడమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రేమ సమాజం గౌరవ కార్యదర్శి మట్టపల్లి హనుమంతరావు హాజరై అన్న ప్రసాద వితరణ చేశారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ అన్నం పరబ్రహ్మస్వరూపమని ప్రతి ఒక్కరూ అన్నప్రసాద వితరణ చేయాలన్నారు.

అన్ని దానాల్లో కెల్లా అన్నదానం ఉత్తమమని పేర్కొన్నారు. చక్కని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ నార్త్ ఈస్ట్ కమిటీ సభ్యులను ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నార్త్ ఈస్ట్ అధ్యక్షులు కడిమిశెట్టి గాంధీ, కార్యదర్శి టి. రమణ గుప్త, కోశాధికారి కె.రాధ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, లయన్స్‌క్లబ్ ప్రతినిధి ఎస్.సోమరాజు, క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పెరగనున్న తాగునీటి ఖర్చులు

చెన్నై : చెన్నైలో తాగునీటి ఉపయోగాన్ని ఖచ్చితంగా తెలుసుకునేందుకు డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు. దీంతో తాగునీటి ఖరీదు భారీగా పెరగనుంది. చెన్నై తాగునీటి శాఖ ద్వారా ఎనిమిది లక్షల ఇళ్లకు తాగునీటి కనెక్షన్ ఇవ్వటం జరిగింది. ఇళ్లకు నెలకు రూ.50, పార్ట్‌టైం వ్యాపార రీతి తాగునీటి కనెక్షన్లకు రూ.150, పూర్తిస్థాయి వ్యాపార రీతి కనెక్షన్లకు రూ.200 రుసుము వసూలు చేస్తూ వస్తున్నారు. తాగునీరు వృథాను అడ్డుకోవడానికి వ్యాపార రీతి తాగునీటి కనెక్షన్లకు రుసుము పెంచాలని నిర్ణయించారు. కచ్చితంగా గణించేందుకు డిజిటల్ మీటర్ ఏర్పాటు చేసేందుకు తాగునీటి శాఖ నిర్ణయించింది. మొదటి విడత ఏప్రిల్ నాటికి 12వేల డిజిటల్ మీటర్లు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఏటా 10వేల కొత్త కనెక్షన్లు అధునికీకరణ వ్యాపార రీతి తాగునీటి కనెక్షన్లకు ఎంత నీరు వినియోగిస్తున్నారో దానికి తగినట్లు రుసుము వసూలు చేయనున్నారు. ఆ మేరకు ఆధునిక డిజిటల్ మీటర్ కొనుగోలుకు ఫిబ్రవరి చివరిలో టెండర్ ప్రకటించనున్నారు. ఈ పథకం విజయవంతం అయితే అన్ని కట్టడాలకు విస్తరించనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇళ్లకు వెయ్యి లీటర్ల తాగునీటికి రూ.20 రుసుము వసూలు చేస్తున్నారు. ఈ పథకం అమలు చేస్తే నాలుగు రెట్లు పెరుగుతుంది.







**స్థానిక పెదవాల్తేరు రైతుబజార్‌లో శనివారం ఉదయం సంక్రాంతి సంబరాలలో భాగంగా రైతులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. గ్రామాలలో సంక్రాంతి సంబరాలు, హడావిడిగురించి వేరే చెప్పనక్కరలేదు. కానీ పట్టణాలలో తమ వృత్తి, వ్యాపారాల నిమిత్తం వచ్చిన రైతులకు కొంతమేర ఆట విడుపుగా ఉండేందుకు ఈ పోటీలను ఎస్టేట్ అధికారి నిర్వహించారు. ఏ రైతు బజార్‌లోనూ ఈ విధంగా నూతన సంబరాలు నెలకొల్పలేదు. రైతుబజార్‌లో శనివారం హాజరైన రైతులకు ముగ్గుల పోటీలు, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ ఛైర్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం గావించారు. ఈ కార్యక్రమ నిర్వహణ చేసిన ఎస్టేట్ అధికారి నలమహారాజును రైతులు, వినియోగదారులు అభినందించారు.**

# ప్లాటినం జూబ్లీ గెస్ట్‌హౌస్ డైరీ ఆవిష్కరణ

ఏయూ : ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్లాటినం జూబ్లీ గెస్ట్‌హౌస్ తీర్చిదిద్దిన నూతన సంవత్సర డైరీని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వర రావు, శ్రీమతి లక్ష్మిలు ఆవిష్కరించారు. శనివారం ఉదయం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన రిజిస్ట్రార్ పాల్గొని డైరీని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గెస్ట్ హౌస్‌కు వచ్చే అతిథులను చిరునవ్వుతో స్వాగతం పలకాలని, వారికి అవసరమైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం సిబ్బంది సంక్రాంతికి స్వాగతం పలుకుతూ తీర్చిదిద్దిన రంగ వల్లులను పరిశీలించారు. సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో గెస్ట్‌హౌస్ డీన్ ఆచార్య కె.రఘు బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


డైరీని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమా మహేశ్వర రావు

# టిఎస్సార్ సంక్రాంతి శుభాకాంక్షలు


రాజ్యసభ సభ్యులు, రాజ్యసభ సబార్డినేట్ లెజిస్టేషన్‌కమిటీ ఛైర్మన్ డా.టి.సుబ్బరామిరెడ్డి విశాఖపట్నం ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంక్రాంతి అందరిలో కొత్త కాంతులు నింపాలని ఆకాంక్షించారు. భోగ భాగ్యాలు, సిరిసంపదలతో ప్రతి ఒక్కరూ ఆనందంగా జీవించాలని అభిలషించారు. పాడి పంటలతో పల్లె జనమంతా సంతోషంగా గడపాలని కోరుకుంటూ ఈ పండుగ అందరి ఇంట సందడిగా సాగాలని అన్నారు.

# భరతమాత ముద్దుబిడ్డ వివేకానంద




గాజువాక: స్ఫూర్తిప్రదాత, భారతమాత ముద్దుబిడ్డ, స్వామి వివేకానంద 155వ జయంతోత్సవం ఘనంగా నిర్వహించారు. నవ్యచేతన మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు అడ్వకేట్ అండిబోయిన లక్ష్మి ఆధ్వర్యంలో పెదగంట్యాడ ఉడా కాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాజువాక వైకాపా సమన్వయకర్త తిప్పల నాగిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ యువతకు దశానిర్దేశాన్ని చూపిన వివేకానందుని జన్మదినాన్ని యువజనోత్సవంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించడం హర్షించవలసిన విషయమని తెలిపారు. వివేకానందుని ఆశయ సాధనకు యువత కృషి చేయాలని, ఆయన అడుగుజాడలలో యువత పయనించాలని అన్నారు. అనంతరం నవ్యచేతన మహిళా సేవా సంఘం అధ్యక్షురాలు అడ్వకేట్ అండిబోయిన లక్ష్మి చేతులమీదుగా కేంద్రీయ విద్యాలయం పాఠశాలకు చెందిన విద్యార్థినికి ఫీజు చెల్లించేందుకు ఆర్థిక సహాయాన్ని అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ స్వార్థం విడనాడి, పరోపకారానికి పెద్దపీట వేయాలని, తద్వారా సమాజ శ్రేయస్సుకు తోడ్పాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు అండిబోయిన అప్పారావు, వైకాపా నాయకులు మర్డపూడి పరదేశి, ఎస్సీ సెల్ వేంపాడ అప్పారావు, బత్తిన పరదేశి, కడవల తాతాబ్బాయి, సంఘం కార్యదర్శి నడిగట్ల పైడికొండ, ధనలక్ష్మి, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను క్యాలెండర్ విడుదల చేసిన ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి




సబ్బవరం: మండల కేంద్రంలో విజయభాను క్యాలెండర్ విడుదల చేసిన ఎస్ఐ ప్రభాకరరెడ్డి మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం విజయభాను క్యాలెండర్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజలందరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలం దరూ సుఖ సంతోషాలతో, భోగభాగ్యాలతో సంక్రాంతి పండగ జరుపుకోవాలని కోరారు. విజయభాను దిన పత్రిక ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి కోసం పనిచేయాలని యాజమాన్యాన్ని కోరారు. మరెన్నో సంవత్సరాలు ప్రజల కోసం పని చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్ఐ నరసింహమూర్తి, హెడ్ కానిస్టేబుల్ చిరంజీవి, కానిస్టేబుల్స్, సిబ్బంది నాయుడు, పాలవెల్లి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఇసిఎస్ ఛైర్మన్ పదవి
# అనకాపల్లికి కేటాయించాలి



అనకాపల్లి : ఆర్ఇసిఎస్ ఛైర్మన్ పదవిని అనకాపల్లి మండలానికి కేటాయించాలని తెలుగుదేశం పార్టీ మండలానికి చెందిన సర్పంచ్,. ఎంపిటిసిలు పార్టీ సీనియర్ నాయకులు, జన్మభూమి కమిటీ సభ్యులు, ఎంపిపి ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. పట్టణంలోని తుమ్మపాల వెంకటేశ్వర కళ్యాణ మండపంలో మండల తెలుగుదేశం పార్టీ ప్రజా ప్రతినిధులతో సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా అనకాపల్లి మండలానికి చెందిన వ్యక్తికి ఆర్ఇసిఎస్ ఛైర్మన్ పదవిని కేటాయిం చాలని తీర్మాణం చేశారు. ముందుగా తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎంపిపి రొంగలి శ్రీరామ్మూర్తి, టీడీపీ నాయకులు కొణతాల శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్య క్షుడు పచ్చికూర రాము, దాడి పెంటారావు, పి నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి భర్త పల్లెల నాగేశ్వరరావు, కోరాడ మహేష్, ఎంపిటిసి రాపేటి రాము తదితరులు మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో 12వేల ఓట్ల మెజార్టీని తీసుకువచ్చిన అనకాపల్లి మండలాన్ని చిన్నచూపు చూడడం తగదన్నారు. కశింకోట మండలానికి డిసిసిబి డైరెక్టర్, విశాఖ డెయిరీ డైరెక్టర్,మార్కెట్ కమిటి ఛైర్మన్ వంటి పదవులు కేటాయించారని అన్నారు. జివిఎంసి పరిధికి చెందిన తాకాశీ బాబుకు హేమగిరి సత్యనారాయణస్వామి దేవస్థానం వంటి పదవులు ఇచ్చారని చెప్పారు. కావున ఈ దఫా ఆర్ఇసిఎస్ ఛైర్మన్ పదవిని అనకాపల్లి మండలానికి చెందిన వ్యక్తికి కేటాయించాలని మండలం సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కోరారు. ఈ పదవి మండలానికి కేటాయించకపోతే ముకుమ్మడిగా, పార్టీకి రాజీనామా చేస్తామని, హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, మండలంలో సీనియర్ నాయకులు, ఎంపీటీసీలు, జన్మభూమి కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

# ప్రశాంతి పాలిటెక్నిక్ ఎన్ఎస్ఎస్ స్వచ్ఛత ర్యాలీ




అచ్యుతాపురం: ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మండలంలో గల ఎదురువాడ, దుప్పితూరు గ్రామాలలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిభిరాలు శనివారంతో ముగిసాయి. ఈ గ్రామాలలో గత వారం రోజులుగా విద్యార్థులు ఆరోగ్యం, విద్యా, పారిశుద్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాలలో ఒడిఎఫ్‌పై సమగ్ర సర్వే నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ అధికారులు గోపాలకృష్ణ, ఉమా మహేశ్వర్రావులు తెలిపారు. గ్రామాలలో స్వచ్ఛత ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

## సౌత్ ఏషియన్ పిసాపోల్ పోటీలకు
# విశాఖ వాసుల ఎంపిక

### 2017లో జరిగిన జాతీయస్థాయి పోటీలలో ద్వితీయస్థానం



విశాఖపట్నం: ఖాట్మండ్ (నేపాల్)లో జరగనున్న సౌత్ ఏషియన్ పిసాపోల్ క్రీడలకు విశాఖ వాసులు ఇద్దరు ఎంపిక అయినట్లు డిస్ట్రిక్ట్ పిసాపోల్ అసోసియేషన్ గౌరవనీయ సెక్రటరీ సిహెచ్. నాగేశ్వర రావు ఒక ప్రకటనలో తెలి పారు. కె. రేష్మ, కె. షణ్ముఖ ఇద్దరు క్రీడాకారులు జనవరి 18 నుండి 20, 2018లో జరగనున్న సౌత్ ఏషియన్ పిసాపోల్ పోటీలకు ఎంపికయినట్లు వారు తెలిపారు. అంతేకాకుండా నవంబర్ 2017లో జరిగిన జాతీయ స్థాయి పిసాపోల్ చాంపియన్‌షిప్ పోటీలలో ఈ సంస్థ ద్వితీయ స్థానం సాధిం చినట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలం భవాని, లాలం భాస్కరరావు, పిసాపోల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి. నూకరాజు, దానయ్య, పిసాపోల్ కార్యదర్శి సిహెచ్. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కోట్లతో అనకాపల్లి పట్టణానికి పైపులైనులు ద్వారా
# ఇంటింటికి శుద్ధి చేసిన నీటిని సరఫరా

అనకాపల్లి : అనకాపల్లి పట్టణానికి 25కోట్ల రూపాయలు నిధులుతో ఇంటింటికి పైపులైనులు ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని అందించనున్నట్లు ఎమ్ఎల్ఎ పీలాగోవింద సత్యనారాయణ తెలిపారు. గురువారం ఉదయం భీమునిగుమ్మంలో జన్మభూమి మా ఊరు కార్యక్రమమును జివిఎమ్‌సి జోనల్ కమిషనర్ ఎస్‌కె సుభాని ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ఎమ్ఎల్ఎ పీలాగోవింద సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 165 కోట్లు నిధులు తాగునీటి కోసం విడుదల చేసిందని , అందులో 25కోట్లు కేవలం అనకాపల్లి పట్టణానికి యుద్ధప్రాతిపదికన ఖర్చుచేసి ప్రజలకు మట్టి ,బురద నీటి సరఫరా నుండి విముక్తి చేసి శుద్ధి చేసిన తాగునీటిని అందించనున్నీమని అయన తెలిపారు. రాష్ట్ర ప్రజలుకోసం సిఎమ్ చంద్రబాబు నిరంతరం పరితపిస్తు, అనేక పథకాలు ప్రవేశపెట్టారని ఆయన వివరించారు. 750 వందల కోట్లు డ్వాక్రా సంఘాలకు కేటాయించి వడ్డీ లేనె రుణాలు అందించడం ప్రారంభం అయిందన్నారు. పట్టణంలో ఉన్న ఎన్టీఆర్ వైధ్యాలయం గతంలో వందపడకల ఆసుపత్రిగా ఉండేదని , ఇప్పుడు 250 పడకల ఆసుపత్రిగా అభవృద్ధి చేసిన ఘనత చంద్రబాబునాయుడుకే చెందుతుందని అన్నారు. ప్రజల సహకారంతో పట్టణాన్ని స్మార్ట్ సిటీగా అభివృద్దిని త్వరలో అందరూ చూస్తారని చెప్పారు.

ముందుగా జన్మభూమి కమిటీ సభ్యులు మళ్ళ సురేంద్ర , బుద్ధ నాగజగదీశ్వరరావు ప్రజలకు అందిస్తున్న వివిధ పధకాలు గురించి ప్రజలకు వివరించారు. అనంతరం జన్మభూమి ప్రతిజ్ఞ పీలా అందరి చేత చేయించారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టరు కాండ్రేగుల సత్యవతి , మళ్ళ శ్రీరాములు, బొడ్డేడ జోగినాయుడు, కొణతాల నూకినాయుడు, జివిఎమ్‌సి అది . కారులు, సిబ్బంది పాల్గోన్నారు.

## ఆకట్టుకున్న
# అన్నమాచార్య సంకీర్తనలు



విశాఖపట్నం : శ్రీ విష్ణుమూర్తికి ప్రీతికరమైన ధనుర్మాసం సందర్భంగా అన్నమాచార్య భావన వాహిని మరియు సాంస్కృతిక సంగీత సేవా సంస్థ మెలోడి క్రియేటర్స్ వారి ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు సిహెచ్.వి. సత్యనారాయణ, కార్యదర్శి ఎం.వి.రాజశేఖర్, కన్వీనర్ కె.వీరాస్వామిల సారథ్యంలో రామ్‌నగర్ మెయిన్ రోడ్డు దరి శ్రీ రాఘవేంద్ర స్వామిమఠంలో నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తనా గానం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. నగరానికి చెందిన ప్రముఖ గాయని జి.పరిమళ అన్నమాచార్య సంకీర్తనలను గానం చేసి సభికుల మన్ననలు పొందారు. ఈ సంకీర్తన కార్యక్రమానికి ఆర్గాన్‌పై టి.వాసు, మృదంగంపై పి.బాలాజీ యువరాజ్, ప్యాడ్స్‌పై సిహెచ్.వి. సత్యనారాయణ, తాళంపై ఎం.వెంకటరాజశేఖర్ గార్లు సహకరించారు. కార్యక్రమం అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేయడమైనది. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య భావన వాహిని కో-ఆర్డినేటర్ ఎ.పి.ఎస్.మూర్తి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, మెలోడి క్రియేటర్స్ అధ్యక్షులు సిహెచ్.వి.సత్యనారాయణ, ప్రోగ్రామ్ కో- కన్వీనర్లు ఆచార్య కె.మురళీకృష్ణ, జె.సోమయాజులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## బ్రాండిక్స్ ఉచిత కంటి వైద్య శిబిరం రద్దు

అచ్యుతాపురం: బ్రాండిక్స్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిభిరం సంక్రాంతి పండగ కారణంగా నేడు నిర్వహించట్లేదని శనివారం బ్రాండిక్స్ ఇండియా పార్ట్‌నర్ దొరస్వామి అన్నారు. బ్రాండిక్స్ ఆద్వర్యంలో ప్రతీ నెల 2వ, 4వ ఆదివారాలలో ఉచిత కంటి వైద్వ శిభిరం నిర్వహిస్తున్నామని అయితే సంక్రాంతి పండగ కారణంగా నేడు నిర్వహించడం లేదన్నారు. ఈ ఉచిత కంటి వైద్య శిభిరం 4వ ఆదివారమైన ఈ నెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు దొరస్వామి తెలిపారు.

# ఆంధ్రుల అభిమాన నటుడు సొగ్గాడు శోభన్‌బాబు



సింథియా: ఆంధ్రుల అభిమాన నటుడు, అందగాడు సినీ హీరో శోభన్‌బాబు అని జిల్లా శోభన్‌బాబు సేవా సంఘం అధ్యక్షులు పెంటకోట అప్పలనాయుడు పేర్కొన్నారు. శనివారం జీవీయంసీ 49వ వార్డు ప్రకాష్‌నగర్‌లో జిల్లా శోభన్‌బాబు సేవా సంఘం ఆధ్వర్యంలో అభిమానుల సమక్షంలో ఆయన జ్ఞాపకార్థం నూతన సంవత్సరం-2018 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ సినీ పరిశ్రమ గర్వించదగ్గ నటులని, నటనతో ప్రేక్షకులను మెప్పించి చిరస్థాయిగా అభిమానుల గుండెలలో నిలిచే మహానటులని అన్నారు. ఎన్నో కుటుంబకథా చిత్రాలలో నటించి ప్రేక్షకుల మన్నలను పొందిన మహానటులని కొనియాడారు. సినీ రంగంలోనే కాకుండా సేవారంగంలోకూడా ఆయన చేసిన సేవలను మరువలేమని అన్నారు. అటువంటి వ్యక్తి మన తెలుగువాడు కావడం ఎంతో గర్వకారణమని అన్నారు. అటువంటి వ్యక్తి మనమద్య లేక పోవడం దురదృష్టంకరమని అన్నారు. ఆయన జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆది, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కింతలి రోడ్డుకు మరమ్మతు పనులు



మాడుగుల : ఎట్టకేలకు మాడుగుల ఘాటీరోడ్డు నుండి కింతలి గ్రామానికి వెళ్లే తారురోడ్డు కు మరమ్మతు పనులు ప్రారంభయ్యాయి. ఆరుకిలో మీటర్లు పొడుగు ఉన్న ఇక్కడ తారురోడ్డు గత రెండేళ్లుగా మరమ్మతులకు గురై, శిథిలమై పెద్దపెద్ద రంధ్రాలు పడి ఉంది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కరంగా తయారైంది. పలు ద్విచక్రవాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. ఈరోడ్డు గుండా గ్రెనైట్ ట్రక్కులు తిరగడం వల్లే తారురోడ్డు మరమ్మతులకు గురైందని వెంటనే తారు రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఇటీవల సిపిఎం పార్టీ నాయకులు దర్నాకూడా చేపట్టారు. దీనిపై స్పందించిన అధికారులు ఆరుకిలోమీటర్లు పొడుగున ఉన్న ఈ తారురోడ్డుకు 14 లక్షల వ్యాయంతో రోడ్డుకు పడిన రంధ్రాలకు పూడుస్తు మరమ్మతులు పూర్తి చేయడం జరుగుతందని గుత్తేదారు తెలిపారు. దీంతో 20 గ్రామాల ప్రజల రహదారి కష్టాలు తీరనున్నాయి.

## విజయభాను సంపాదకీయం

# విశ్వసనీయత కాపాడుకోవాలి

న్యాయమూర్తులు కొందరు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పుబట్టడం వల్ల న్యాయ వ్యవస్థ మీద నమ్మకం సడలుతుందనే భయాందోళనలు అవసరం లేదు. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఇప్పటికే వేళ్లూనుకున్నది. ప్రజలకు రాజ్యాంగ వ్యవస్థలపై ఇంకా నమ్మకం సడలలేదు. న్యాయ వ్యవస్థలో లోపాలు ఉన్నాయనేది తెలుసు. ఇటీవలి కాలంలో కొందరు న్యాయమూర్తులు అపఖ్యాతిపాలైన మాట వాస్తవమే. అయినప్పటికీ స్థూలంగా చూస్తే న్యాయమూర్తుల విశ్వసనీయత దెబ్బతినలేదు. ఏ కొద్దిమంది వల్లనో ఈ విశ్వసనీయత ఇకముందు దెబ్బతినకుండా కాపాడుకోవాలె. ఇటీవలి పరిణామాలు న్యాయవ్యవస్థను సంస్కరించవలసిన అవసరాన్ని సూచిస్తున్నాయి.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నలుగురు గురువారం పత్రికా సమావేశం ఏర్పాటుచేసి ప్రధాన న్యాయమూర్తిని బహిరంగంగా తప్పుబట్టడం దిగ్భ్రాంతికరం. దేశ చరిత్రలో ఏనాడూ ఇటువంటి ఘటన చోటుచేసుకోలేదు. న్యాయవ్యవస్థలో ఆంతరంగికంగా ఎన్ని విభేదాలు ఉన్నా, న్యాయమూర్తులు గుంభనంగా వ్యవహరించడం పరిపాటి. సమాజంలో కలిమిడిగా తిరుగకుండా, సందేహాలకు అతీతంగా ఉండాలని ప్రయత్నిస్తారు. అటువంటి ప్రధాన న్యాయమూర్తి తరువాత, అత్యంత సీనియర్ న్యాయమూర్తులు- చలమేశ్వర్, గొగోయి, లోకుర్, కురియన్ జోసెఫ్- బహిరంగంగా ప్రధాన న్యాయమూర్తిని తప్పుబట్టారు. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా తన వ్యవహారసరళిని మార్చుకోవాలని కొద్దినెలల కిందటే వీరు లేఖ రాసి ఆయనకు అందజేశారు. జస్టిస్ మిశ్రా నుంచి స్పందన లేకపోవడంతో, గురువారం ఉదయం ఆయనను కలుసుకొని చివరి ప్రయత్నంచేశారు. ఆయనలో మార్పురాదని గ్రహించి, బహిరంగంగా తమ అసంతృప్తిని వెల్లడించారు. న్యాయవ్యవస్థలో పరిణామాలు వాంఛనీయం కాదని, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. న్యాయవ్యవస్థ నిష్పాక్షికంగా లేకపోతే, ప్రజాస్వామ్యం నిలువ జాలదని వారు అభిప్రాయపడ్డారు. కొద్దినెలల కిందట వారు ప్రధాన న్యాయమూర్తికి రాసిన లేఖను వారు బయటపెట్టారు. న్యాయ వ్యవస్థలో తాజా పోకడలు ఆమోదయోగ్యంగా లేవనేది అందరికీ తెలిసిందే. కానీ న్యాయవ్యవస్థ వ్యవహారం కనుక, బహిరంగ విమర్శలు భారీస్థాయిలో వ్యక్తంకాలేదు. న్యాయమూర్తులే ముందుకు వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు న్యాయవ్యవస్థపై భిన్న కోణాలలో చర్చ జరుపడానికి ఆస్కారం ఏర్పడ్డది. దీనిని వ్యక్తిగత విభేదాలుగా కాకుండా, వ్యవస్థాగత లోపాలను సవరించుకోవడానికి మార్గంగా భావించాలె. న్యాయమూర్తులు ముక్తసరిగా అయినా తమ విభేదాల కారణాన్ని వివరించారు. న్యాయమూర్తికి రాసిన లేఖ ద్వారా వారి వాదనలు స్పష్టంగా తెలుస్తున్నాయి. న్యాయస్థానం ముందు కు కేసులు వచ్చినప్పుడు, వాటిని ఏయే న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం విచారించాలనేది ప్రధాన న్యాయమూర్తి నిర్ణయిస్తారు. అయితే ఏది ఎవరికి కేటాయించాలనే విషయమై ఇప్పటికే స్థిరపడిన పద్ధతులు ఉన్నాయి. ఆ పద్ధతి ప్రకారం కేటాయిస్తే ఆరోపణలకు తావు ఉండదు. కానీ ప్రధాన న్యాయమూర్తి సుస్థిర సంప్రదాయాలను ఉల్లంఘి స్తూ, కొన్ని కీలకమైన కేసులను కొందరు న్యాయమూర్తులకే కేటాయిస్తున్నారు. సీనియర్ న్యాయమూర్తుల ముందున్న కేసులను, మరో ధర్మాసనానికి అప్పగించి, హడావుడిగా నిర్ణయాలు తీసుకు న్నతీరు అభ్యంతరకరమైనది. బీజేపీ నేత అమిత్ షా నిందితుడుగా ఉన్న కేసును విచారిస్తున్న న్యాయమూర్తి అనుమానాస్పదస్థితిలో మరణించా డు. మెడికల్ కాలేజీ కుంభకోణం కొందరు న్యాయమూర్తులపై అనుమానాలు కలిగిస్తున్నది. ఇటువం టి కీలకమైన కేసుల విషయంలో ప్రధాన న్యాయమూర్తి వ్యవహరించిన తీరు విమర్శలకు తావిచ్చిం ది. న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలు తీవ్రమైనవి. ఇప్పటికైనా ప్రధాన న్యాయమూర్తి స్పందిం చి, ఆరోపణలకు తావులేకుండా వ్యవహరించి, న్యాయవ్యవస్థపై ఉన్న నమ్మకాన్ని కాపాడాలె. ఈ వివాదాన్ని ఇంకా సాగదీయడం న్యాయవ్యవస్థకు, ప్రజాస్వామిక వ్యవస్థకు శ్రేయస్కరం కాదు. న్యాయమూర్తులు కొందరు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పుబట్టడం వల్ల న్యాయ వ్యవస్థ మీద నమ్మకం సడలుతుందనే భయాందోళనలు అవసరం లేదు. మన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ఇప్పటికే వేళ్లూనుకున్నది. ప్రజలకు రాజ్యాంగ వ్యవస్థలపై ఇంకా నమ్మకం సడలలేదు. న్యాయ వ్యవస్థలో లోపాలు ఉన్నాయనేది తెలుసు. ఇటీవలి కాలంలో కొందరు న్యాయమూర్తులు అపఖ్యాతిపాలైన మాట వాస్తవమే. అయినప్పటికీ స్థూలంగా చూస్తే న్యాయమూర్తుల విశ్వసనీయత దెబ్బతినలేదు. ఏ కొద్దిమంది వల్లనో ఈ విశ్వసనీయత ఇక ముందు దెబ్బ తినకుండా కాపాడుకోవాలె.

# ప్రపంచ కుబేరుడి.. భారీ విరాళం



బిల్‌గేట్స్‌ను దాటేసి ప్రపంచ కుబేరుడిగా నిలిచిన అమెజాన్ సీఈవో జెఫ్ బెజోస్ భారీ విరాళం ప్రకటిం చారు. నాన్-ప్రాఫిట్ ఆర్గనైజేషన్ దిడ్రీమ్.యూఎస్‌కు 33 మిలియన్ డాలర్లను (రూ.209కోట్లను) విరాళంగా అందించినట్టు తెలిసింది. ఈ మొత్తాన్ని శరణార్థ విద్యార్థులకు కాలేజీ స్కాలర్‌షిప్‌లుగా అందించ నున్నారు. జెఫ్ బెజోస్, ఆయన భార్య మెకంజీ అతిపెద్ద విరాళం అందించారని దిడ్రీమ్.యూఎస్ తెలిపింది. వెయ్యి స్కాలర్‌షిప్‌లకు ఈ నిధులను వాడనున్నట్టు పేర్కొంది. ఇప్పటివరకు తాము అందుకున్న వాటిలో ఇదే పెద్ద మొత్తమని చెప్పింది. ఈ సందర్భంగా జెఫ్ బెజోస్ అమెరికాకు వచ్చిన తొలి రోజుల్ని గుర్తు చేసుకున్నారు. " నా 16 ఏళ్ల వయసున్నప్పుడు మా నాన్న అమెరికా వచ్చారు. ఒకడే ఈ దేశంలోకి అడుగుపెట్టారు. కనీసం ఇంగ్లీష్ మాట్లాడటం కూడా రాదు. డెలావేర్‌లో కొన్ని గొప్ప సంస్థల సాయంతో మా నాన్న ఓ గొప్ప పౌరుడిగా ఎదిగారు" అని తెలిపారు. 105 బిలియన్ డాలర్లతో జెఫ్ బెజోస్ ఇటీవలే ప్రపంచ కుబేరుడయ్యారు. ఈ ఏడాది తొలి ఆరు ట్రేడింగ్ రోజుల్లోనే బెజోస్ 6.1 బిలియన్ డాలర్లను ఆర్జించినట్టు బ్లూమ్‌బర్గ్ బిలీనియర్ ఇండెక్స్ రిపోర్టు చేసింది. మైక్రోసాఫ్ట్ బిల్‌గేట్స్‌ను దాటేసి బెజోస్ ఈ స్థానాన్ని దక్కించుకున్నారు. అమెజాన్ షేర్లు పెరుగుతూ ఉండటంతో ఆయన నికర సంపద కూడా అంతకంతకు పెరుగుతోంది.

# ఓటు వేయలేదని గ్యాంగ్‌రేప్.. హత్య

రాంచీ : జార్ఖండ్ లో దారుణం చోటు చేసుకుంది. ఎన్నికల్లో తన భార్యకు మద్దతు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఒక కుటుంబంపై పగ పెంచుకుని దాష్టీకానికి పాల్పడ్డాడు. ఆ కుటుంబంలోని 13 ఏళ్ల బాలికపై సాముహిక అత్యాచారానికి పాల్పడి.. కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారింది.

అసలేం జరిగిందంటే... పాకూరు జిల్లా లిట్టిపారా గ్రామ పంచాయితీలో ముఖియా పదవి కోసం కొన్నాళ్ల క్రితం ఎన్నికలు జరిగాయి. ప్రేమ్‌లాల్ హంసద అనే వ్యక్తి భార్య ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. అయితే బాధిత కుటుంబ సభ్యులు మాత్రం ఆమెకు ఓటు వేయలేదు. దీంతో వారి మూలంగానే తన భార్య ఓడిపోయిందన్న కోపంతో ప్రేమ్‌లాల్ రగిలిపోయాడు. జనవరి 8న బహిర్భూమికని వెళ్లిన బాలికను తన సోదరుల సహకారంతో అపహరించాడు. ఆపై వారంతా కలిసి ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడి, ప్రాణాలు తీశారు. చివరకు బాలిక మృత దేహాన్ని సమీపంలోని బ్లైవాన్ అటవీ ప్రాంతంలో పడేశారు.

బాలిక కనిపించకుండా పోయే సరికి ఆందోళన చెందిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనుమానంతో వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. వారిచ్చిన సమాచారం మేరకు బాలిక శవాన్ని స్వాధీనపరుచుకున్నారు. ఆపై నిందితులపై తల్లిదండ్రుల ఫిర్యాదు చేయటంతో వారిని అరెస్ట్ చేశారు.

**తీవ్ర విమర్శలు...**

నిందితులు రాజకీయంగా కాస్త పలుకుబడి ఉన్నవారు కావటంతో తొలుత కేసు నమోదు చేసుకునేందుకు పోలీసులు తటపటాయించారు. అయితే ప్రతిపక్షాల ఆందోళన, తల్లిదండ్రుల నిరసన ప్రదర్శనతో పోలీసులపై విమర్శలు గుప్పించారు. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించి.. తక్షణమే వారిని అరెస్ట్ చేయాలని పోలీస్ శాఖకు ఆదేశాలు జారీ చేసింది. ఎట్టకేలకు నిందితులను అరెస్ట్ చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు.

ఈ కేసులో ఎలాంటి తమపై ఎలాంటి ఒత్తిళ్లు రాలేదని.. సాక్ష్యాలు సేకరించటంలో జాప్యం మూలంగానే అరెస్ట్ ఆలస్యం అయ్యిందని పాకూరు జిల్లా ఎస్పీ శైలేంద్ర బర్న్వాల్ వెల్లడించటం విశేషం. నిందితులు ప్రేమ్‌లాల్, శ్యామూల్, కథి, శిశు హందలు నేరాన్ని ఒప్పుకోవటంతో వారిని రిమాండ్‌కు తరలించినట్లు వారు వివరించారు.

# సీఎంల వార్ ముదిరింది



లక్నో : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ ట్వీట్‌తో ఎదురు దాడి చేశారు. తాను హిందువునని సిద్ధ రామయ్య చెప్పు కోవడంపై యోగి స్పందిస్తూ ఒక నిమిషంపైగా నిడివిగల వీడియోను ఉత్తర ప్రదేశ్ బీజేపీ శాఖ ట్విటర్ ఖాతాలో పెట్టారు. ఈ వీడియోలో గత మూడేళ్ళలో కర్ణాటకలో మరణించిన హిందువుల ఫొటోలను పెట్టారు. యోగి అడిగినపుడు సిద్ధరామయ్య తాను హిందువునంటారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై కూడా యోగి ఈ వీడియోలో విరుచుకుపడ్డారు. గుజరాత్ ఎన్నికల సమయంలో అనేక దేవాలయాలను సందర్శించారని, హిందువునని ప్రకటించుకున్నారని పేర్కొన్నారు. దేశంలో చీలిక తెచ్చేందుకు మతాన్ని ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. గత ఐదేళ్ళలో మీరు కొంచెమైనా పని చేసి ఉంటే, కాంగ్రెస్ నేత రాజ్‌కున్వర్‌కు వంట చేయవలసిన అవసరం ఉండేది కాదన్నారు.

కర్ణాటకలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1,002 రైతు ఆత్మహత్యలు జరిగాయని పేర్కొన్నారు. సిద్దరామయ్యపై అవినీతి కేసుల గురించి ప్రస్తావించారు.

# రాహుల్ గాంధీతో ముఖ్యమంత్రి భేటీ

న్యూఢిల్లీ : కర్ణాటకలో కాంగ్రెస్ పరిస్థితిపై రాహుల్ గాంధీ చాలా సంతోషంగా ఉన్నారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేకత లేకపోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలన్నిటినీ తన ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని ఆయన నివాసంలో శనివారం ఉదయం సిద్ధరామయ్యతోపాటు మరికొందరు సీనియర్ కాంగ్రెస్ నేతలు సమావేశమయ్యారు. ఏప్రిల్-మే నెలల్లో కర్ణాటక శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవల సిద్ధరామయ్య మాట్లాడుతూ బీజేపీ, ఆరెస్సెస్ హిందుత్వ అతివాదులని ఆరోపించిన సంగతి తెలిసిందే. కర్ణాటకలో హిందూ వ్యతిరేక ప్రభుత్వం ఉందని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ఆరోపించారు.

## కవి సమయం

# తెలుగు వెలుగుల జిలుగుల పండగ

పండగ... పండగ...
తెలుగిళ్ళ లోగిళ్ళు, తళతళ మెరిసే పండగ
పెద్దలు నచ్చే పండగ, పిన్నలు మెచ్చే పండగ.
పెద్దల్ని కొలిచే పండగ, సుద్దుల్ని పంచే పండగ
భూమాత ఈస్ట్మన్ కలర్లో...
తళుకులీనే పండగ.
గోమాత పొదుపు ముంతడు పాలతో...
పొంగిపొర్లే పండగ.
ఇబ్బడి ముబ్బడిగా పంట కళ్ళాల...
రాశులు నిండే పండగ.
పిల్లా, పెద్దా, గొడ్డు, గోదా...
నవ్వగలిగే పండగ.
మళ్ళి మళ్ళి ఎగరగలిగే పండగ.
భగభగమంటు, భుగభుగ ఎగిసే...
భోగీ మంటల పండగ.
ఆకలి పేగుకి అమృతమిచ్చే...
'కక్క ముక్కల' కనుమ పండగ.
పశువుల పండగ, శిశువుల పండగ.
అల్లుళ్ళ అలకల పండగ.
మరదళ్ళు సొగసుల పండగ.
పైసలు లేని మావల గుండెల...
గుండె గుభేళ్ళు పండగ!!
గొబ్బెమ్మల పండగ, డుడు బసవన్నల పండగ.
హరిదాసు తత్త్వాలు తారాడే పండగ.
రంగవల్లులు ముంగిట్ల తారాడే పండగ.
రయ్‌మని ఎగిరే కోడిపుంజుల పండగ.
మీసాలు మెలేసే, పందెం రాయుళ్ళ...
'పొగరు' బోత్తనాల పండగ!
బుడబుక్కల బూచోళ్ళ, గజిబిజి వేషాల పండగ!!
అందాల పండగ, ఆనందాల పండగ!
సంతసాల పండగ, సంరంభాల పండగ!
పిల్లా, పెద్దా, రాజా, పేదా...
అందరూ ఒకటయ్యే పండగ!!
భోగి, కనుమలు తోడుగ రాగ...
ముక్కనుమ కూడ వేదిక కాగా...
గాదెలు, బోదెలు, గేదెలు...
నిండుగ, మెండుగ, దండిగ నిండే
ఉత్సాహాల, ఉల్లాసాల, సల్లాపాల పండగ!!
దశ దిశల, నలుదెసల
కాంతిని నింపే, క్రాంతిని నిలిపే...
తెలుగుల పండగ, వెలుగుల పండగ
తెలుగు, వెలుగుల జిలుగుల పండగ
సమ్యకి క్రాంతి పండగ...
సంక్రాంతి పండగ.

...కవితా రచన
రమాప్రసాద్ ఆదిభట్ల
సెల్ నెం: 93480 06669

# పంచాంగం

మాసం : ధనుర్మాస; తిథి : త్రయోదశి, తె.9.07; చిత్ర ఉ.7.18; ప.వ.1.09ల 2.49.

**ఆదివారం 14-01-2018**

**మేషం** : రవాణా రంగాలలోని వారికి పనిభారం అధిగమవుతుంది. రావలసిన ధనం సకాలంలో అందుటవల్ల పొదుపు దిశగా మీ ఆలో చనలుంటాయి. నూతన పెట్టుబడులు పెట్టునపుడు పునరాలోచన అవసరం. **వృషభం** : వాహనం కొను గోలుకై చేయు ప్రయత్నాలు వాయిదాపడతాయి. స్త్రీల ఆరోగ్యములలో మెళకువ అవసరం. ముఖ్యుల మధ్య మనస్పర్థలు తలెత్తిన సమసిపోగలవు. ప్రముఖులతో నూతన పరిచయాలేర్పడతాయి. **మిథునం** : నిరుద్యోగులకు నిరుత్సాహం నిర్లిప్తత వంటి చికాకులు తప్పవు. వస్త్ర, కళంకారి, బంగారు, వెండి, చిన్న తరహా పరిశ్రమల వారికి పురోభివృద్ధి. మీ సంతానం కోసం ధనం వ్యయం చేస్తారు. నూతన వ్యక్తుల పరిచయం మీకెంతో సంతృప్తినిస్తుంది. ఓర్పుతో వ్యవహరించడం వల్ల ఒక సమస్య పరిష్కారమవుతుంది. **కర్కాటకం** : విద్యార్థినులు కొత్త విషయాల పట్ల ఏకాగ్రత ఉత్సాహం కనబరుస్తారు. స్త్రీలు తమ వాక్చాతుర్యంతో, తెలివితేటలతో అందరిని ఆకర్షించగలుగుతారు. రవాణా, **సింహం** : దంపతుల మధ్య ఏకీభావం లోపిస్తుంది. స్త్రీలు చుట్టుపక్కల వారి నుంచి అవమానాలు ఎదుర్కొంటారు. రుణ విముక్తులు కావడంతో మానసికంగా కుదుటపడతారు. **కన్య** :ఉపాధ్యాయులకు ఒత్తిడి, విశ్రాంతి లోపం వంటి చికాకులు అధికమవుతాయి. అలంకారాలు, వస్త్రాలు, విదేశీ వస్తువుల పట్ల ఆసక్తి పెరుగుతుంది. కోర్టు వ్యవహారాలు, వాయిదా పడటం మంచిది. సోదరీసోదరుల మధ్య సఖ్యత నెలకొంటుంది. విద్యార్థులు అతి ఉత్సాహం ప్రదర్శించడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొనక తప్పదు. **తుల** :ప్లీడర్లకు, ప్లీడరు గమాస్తాలకు నిరుత్సాహం తప్పదు. **వృశ్చికం** : రిప్రజెంటేటివ్‌లకు ప్రైవేట్ సంస్థలవారికి ఊహించని చికాకులు తలెత్తుతాయి. ఇచ్చిపుచ్చుకునే వ్యవ హారాలు, వాణిజ్య ఒప్పందాలు మీకు అనుకూలిస్తాయి. రాజకీయాలలోని వారికి కార్యకర్తల వలన ఇబ్బందులు ఎదురవుతాయి.



# ధర్మో రక్షతి రక్షితః

## సంకీర్తన

ధర్మబద్ధంగా నడచుకోవడం అంత సులువూ కాదు... అంత కష్టమూ కాదు అనిపిస్తుంది. ముందు ధర్మ సూక్ష్మాలు అవగాహన చేసుకుని, వాటిని వీలైనంత ఆచరించడానికి ప్రయత్నిస్తే ఈ రోజుల్లో కూడా తగినంత ధర్మ చింతనతో సుఖంగా జీవించవచ్చు. అందుకు ముందుగా మన ఇంద్రియాల్ని అదుపులో ఉంచుకోడానికి నిత్యం ప్రయత్నిస్తుం డటమే.

**మండల దీక్ష రహస్యం:**

మానవ శరీరానికి ఒక వింత ప్రవృత్తి ఉంది. మన శరీరానికి, మనసుకీ ఏది అలవాటు చేయాలన్నా 41రోజులు పడుతుంది. అలాగే ఏ అలవాటు మాను కోవాలన్నా అంతే కాలవ్యవధి పడుతుంది. ఈ కోణంలో ఋషులు ఏర్పరచినవే దీక్షలు. యజ్ఞ, యాగాది క్రతువుల్లో కూడా 40 రోజుల పాటు దీక్ష వహించి 41వ రోజున కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా పూర్తి చేసేవారు. రామాయణ, మహాభారతాది పురా ణాల్లో కూడా మనకి ఈ విషయమే కనబడుతుంది. నేడు కొందరు ఆచరిస్తున్న దీక్షల వెనుక ఉన్న అంతరార్థం కూడా ఇదే. నాలుగు ఋతువుల్లో, నాలుగు కాలాలపాటు, నాలుగు దశల్లో ధర్మం కొనసాగుతూ వుంటుంది కనుకనే, ధర్మానికి నాలుగు పాదాలుగా అభివర్ణించారు. అంతేకాని, ధర్మం చతుష్పాద జంతువు మాత్రం కాదు.

**ధర్మమే మనలను కాపాడుతుంది:**

ధర్మో రక్షతి రక్షితః అన్న ఆర్యోక్తిలో ఎంతో సత్యం ఉంది. ధర్మాన్ని మనం అనుసరిస్తూ, దానిని రక్షణ చేస్తున్నంత వరకూ ఆ ధర్మమే మనల్ని అన్ని వేళలా సంరక్షిస్తూ వుంటుంది. ధర్మపరుడైన ధర్మరాజు ఎన్ని అడ్డంకులు వచ్చినా తన ధర్మాన్ని తాను ఆచరిస్తూ ఉండటం వల్లనే, సాక్షాత్ మహావిష్ణువు శ్రీకృష్ణుడై భారత యుద్ధంలో ఆయన పక్షాన నిలబడి విజయాన్ని కట్టబెట్టాడు. ఎన్నో సందర్భాలలో ఆదుకున్నాడు. దైవం మానుష రూపేణ అని కూడా శాస్త్ర వచనం. మనం కష్టాలో ఉన్నా ధర్మబద్ధంగా ఉండి, ఆ భగవంతుని శరణు కోరితే, తక్షణ సహాయాన్ని ఏదో ఒక రూపంలో తప్పకుండా అందిస్తాడు. అందుకు దుష్టాంతాలు మనకి నిజ జీవితంలో ఎన్నో జరిగే ఉంటాయి. అసలు శ్రేయస్సుని కోరే ప్రతి వ్యక్తీ ధర్మాన్ని ఆచరించాలం టాడు గీతాచార్యుడు. శాస్త్రా ల్లో ధర్మం గురించి వివరిం చ బడింది. ఆధ్యాత్మిక శాస్త్ర పరిజ్ఞానాన్ని పెంపొందించు కుంటే, ధర్మాన్ని ఆచరిం చడం మరింత సులువ వుతుంది.

సమగ్ర ధర్మాన్ని పాటించడం వీలులేనపుడు కనీస ధర్మాన్నైనా ఆచరించాలి. పూర్తిగా ధర్మాన్ని విస్మరించడం మంచిది కాదంటారు విజ్ఞులు, కులధర్మం, వృత్తిధర్మం, మనోధర్మం, క్రియాధర్మం, సామాజిక ధర్మం మొదలైనవన్నీ ఆచరణ యోగ్యమైన ధర్మాలే. ఇదే విషయం భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ స్వల్పప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ అంటాడు. ధర్మం కొంచెం ఆచరించినా అది మహాభయం నుంచి కాపాడుతుంది. అదే విధంగా భగవంతుని ఆరాధిం చడంలో కూడా భగవంతుడు సూక్ష్మ ధర్మాన్ని వివరిం చాడు. ఆరాధించడంలో ఆడంబరంకంటే భక్తి ప్రధానం. శక్తి కొలది అంటే పత్రం, పుష్పం, ఫలం, తోయం (నీరు) పరిపూర్ణ భక్తితో సమర్పించినా స్వీకరిస్తానని అన్నాడు. అదీకాక ఎవరికి నిర్దేశించిన ధర్మాన్ని వారు పాటించడం ఉత్తమం. ఉదా హరణకి 7వ తరగతి పరీక్ష రాయవలసిన విద్యార్థి 10 తరగతి పరీక్ష రాస్తే మార్కులు పడవు. ఆ పరీక్షలో ఉత్తీర్ణుడు కాడు. అతని పరీక్షని అతనే రాయాలి. అందుకే పరధర్మాన్ని పాటిద్దామనుకుంటే చిక్కులు తప్పవు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## గ్రామాల్లో ముందుకు సాగని కాంట్రాక్టు పనులు

మాడుగుల: గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన అంగన్‌వాడి,పంచాయితీ,సిసి రోడ్లు వంటి పలు నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం కాంట్రాక్టు లకు పాత ఒప్పందాల ప్రకారంమే ముడిసరుకులకు బిల్లులు మంజూరు చేస్తుండటం వలన నిర్మాణ పనులు చేయలేకపోతున్నామని గుత్తేదారులు వాపోతున్నారు. తాము చేస్తున్న నిర్మాణాలకు ప్రభుత్వం పాత పద్దతిలో సిమెంట్ బస్తాకు రూ. 240లు చెల్లిస్తుంటే ప్రస్తుతం మార్కెట్‌లో దీని ధర రూ.340 ఉందని అలాగే ఐరన్ యూనిట్‌కు రూ.32000కాగా మార్కెట్‌లో 53వేలు, ఇసుకకు ట్రాక్టర్‌కు రూ.500 కాగా బయట రూ.1600 చొప్పున కొనగోలు చేస్తున్నామని అందువల్ల నిర్మాణాలను చేయలేకపోతున్నామని గుత్తేదారులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

# వేములపూడి ఉత్తమ జన్మభూమి నిర్వహణ అవార్డు

### - ధర్మసాగరానికి రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు లభించింది

### - మున్సిపాల్టీకి ఉత్తమ అవార్డు యిచ్చిన జిల్లా కలెక్టర్





నర్సీపట్నం: జన్మభూమి-మావూరు కార్యక్రమం నిర్వహణకు గాను నర్సీపట్నం మండలానికి అత్యధిక ఉత్తమ అవార్డులు రావడం ఆనంద దాయకమని ఎంపీపీ సుకల రమణమ్మ, ప్రత్యేక అధికారిణి సిహెచ్.నాగలక్ష్మి, డిఎల్‌పివో ఆర్.శిరిషారాణి ఆనందాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో వీరికి అవార్డులను బహుకరించారు. స్వయంగా ముఖ్యమంత్రి ధర్మ సాగరం హాజరయ్యి మెచ్చుకోవడంతో రాష్ట్రస్థాయి అవార్డు, మండలంలోని ప్రత్యేక ఆకర్షణగా కార్యక్రమాన్ని ఎల్ఇడి టివిలు ఏర్పాటు చేయడం వలన వేములపూడి పంచాయితీకి, మున్సిపాల్టీలో కూడా దరఖాస్తులు ఎప్పటి కప్పుడు అప్‌లోడ్ చేయడంతో అవార్డులు లభించాయి. ఎంపీడీవో ఎన్.జయ మాధవి, వేములపూడి పంచాయితీ పరిపాలనాధికారి బిఎ సుబ్రహ్మణ్యం, ధర్మసాగరం పంచాయితీ కార్యదర్శి పెదవేగి రాజశేఖర్‌లు అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారు.

జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ లాలం భవాని, ఎమ్మెల్సీ మాధవ్, జాయింట్ కలెక్టర్ సృజన, జాయింట్ కలెక్టర్-2 అట్టాడ సిరి తదితరులు జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు అభినందించారని మండల ప్రత్యేక అధికారిణి ఎస్సీ, కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ సిహెచ్.మహలక్ష్మి తెలిపారు.

## పెదనాయుడుపాలెంలో ఈనెల 15 నుండి షటిల్ టోర్నమెంట్

సబ్బవరం: పెదనాయుడుపాలెం గ్రామంలో ఈనెల 15 నుండి 16 వరకు షటిల్ టోర్నమెంట్ జరుగును. మండల కేంద్రంలో మేజర్ పంచాయితీలో భాగమైన పెదనాయుడుపాలెం గ్రామంలో శ్రీ కోదండ సీతారామ సత్యన్నారాయణ సంతోషిమాత తీర్ధ మహోత్సవం సందర్భంగా ఈనెల 15వతేదీ నుండి 16వతేదీ వరకు షటిల్ టోర్నమెంట్ పోటీలు జరుగునని టోర్నమెంట్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో విలేకర్లకు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.3,000/-, రెండవ బహుమతిగా రూ.2,000/-, మూడవ బహుమతిగా రూ.1000/-లు ఇవ్వబడునని తెలిపారు. ఆసక్తి వున్న వారు ముందుగా ఎంట్రీ ఫీజు రూ.50లు చెల్లించవలెను. ఈ ఫోన్ నెంబర్‌ను సబ్బవరపు శ్రీనివాస్ : 9440564676 సంప్రదించవలెను.



**మాతా సవెందర్ హరదేవ్ మహారాజ్ 62వ పుట్టినరోజు సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆఫీస్ నుండి విశాఖ రైల్వే స్టేషన్ వరకు మొబైల్ సర్వీసు అన్నదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కె.వై.రాజా, సి.హెచ్.రాజు, సుందర్, బి.వెంకటరావు, ఆర్.రమణ, గోవిందు, గద్దిపల్లిరాము, ఎ.గణేష్ తదితరులు పాల్గొన్నారు.**

## వివేకానంద సంస్థకు 50 వేల విరాళం

### వృద్ధాశ్రమానికి రెండు మంచాలు నిర్వాహకులకు చెక్కు అందించిన వి.జె.ఎఫ్. అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు



విశాఖపట్నం : పాతనగరంలో సేవలు అందిస్తున్న శ్రీ వివేకానంద స్వచ్ఛంధ సేవా సంస్థకు వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు 50 వేల రూపాయల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు శనివారం తొలివిడతగా 25 వేల చెక్కును సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్‌అహ్మద్, అధ్యక్షులు సూరాడ అప్పారావులకు శ్రీనుబాబు అందజేశారు. ఇప్పటికే ప్రతిఏటా 25 వేలు సంస్థ నిర్వహించే అన్నదానానికి అందజేస్తున్నట్లు శ్రీనుబాబు వివరించారు. వివేకానంద వృద్ధాశ్రమానికి రెండు మంచాలు కూడా అందజేయడం జరిగిందని తెలిపారు. ఏఫ్రిల్ 15న మరో 25 వేలు నగదుతో పాటు మరో రెండు మంచాలు కూడా అందజేయనున్నట్టు తెలియజేశారు. భవిష్యత్‌లో సంస్థ చేపట్టే అన్ని కార్యక్రమాలకు తమవంతు సంపూర్ణ సహకారం అందిస్తామని శ్రీనుబాబు చెప్పారు. ఈ సంస్థ చేపట్టే అన్నదాన కార్యక్రమానికి గత పదేళ్లుగా తనవంతు సహకారం అందించడం జరుగుతుందన్నారు.

# భావితరాలకు సంస్కృతి, సాంప్రదాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర గనుల శాఖామాత్యులు సుజయ్‌కృష్ణ రంగారావు

విజయనగరం: ఆంధ్రుల సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించి భావితరాలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గనులు భూగర్భ శాఖామాత్యులు ఆర్.వి.సుజయ్‌కృష్ణ రంగారావు అన్నారు. శనివారం స్థానిక అయోధ్య మైదానంలో రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

స్థానిక శాసన సభ్యురాలు మీసాల గీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ కారణాల చేతనైనా పండగ జరుపుకోలేని పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తుందన్నారు.

ప్రభుత్వం అర్హులైన వారందరికీ సంక్రాంతి కానుకలు అందజేసిందన్నారు. రైతులకు, వ్యవసాయానికి ముడిపడిన పండగ సంక్రాంతి అని చెప్పారు.

సభాధ్యక్షురాలు స్థానిక శాసనసభ్యురాలు మీసాల గీత మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరరకు సంక్రాంతి సంబరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

జిల్లా పరిషత్ అధ్యక్షురాలు డా.శోభ స్వాతిరాణి మాట్లాడుతూ అందరూ బాగుండాలని, అందులో మనం వుండాలని కోరుకుంటున్నారన్నారు. జిల్లాను అన్ని రంగాలలోను అభివృద్ధి చేయటానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు.

జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల సంతోష సూచికలు పెరగాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయమన్నారు. జిల్లాలో జన్మభూమి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. జన్మభూమిలో ఉత్తమ సేవలు అందించిన గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి అధికారులకు అవార్డులు ప్రదానం చేశారు.





**జిల్లా కలెక్టర్‌కు సన్మానం**

జిల్లాలో ఓడిఎఫ్ సాధనకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ వివేక్‌యాదవ్‌ను జిల్లా అధికారులు సంక్రాంతి సంబ రాల్లో మంత్రి సుజయ్‌కృష్ణ రంగా రావుతో కలిసి ఘనంగా సన్మా నించారు. మరుగుదొడ్ల నిర్మాణంలో అఖిల భారత స్థాయిలో విజయనగరం జిల్లా 16వస్థానంలో నిలిచిందని అధికారులు వెల్లడించారు. సంక్రాంతి సంబరాల్లో నిర్వహించిన జానపద నృత్యాలు, శాస్త్రీయ నృత్యాలు ఆహుతులను అలరించాయి. ముందుగా మంత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గొబ్బెమ్మ పాటలు, హరిదాసు కీర్తనలు, తప్పెటగుళ్లు, కోలాటం, చెక్కభజనలను తిలకించారు. అదేవిధంగా ఎడ్ల బండి ఎక్కి ఉత్సాహపరిచారు.

ఈ కార్యక్రమంలో బొబ్బిలి చిరంజీవులు, గాదె శ్రీనివాసుల నాయుడు, ప్రసాదుల రామకృష్ణ, శ్రీకేశ్ బి.లత్కర్, జి.పాలరాజు, అనిత, శిఖామణి, మహంతి, చిన్నంనాయుడు, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సంక్రాంతి సంబరాలు

### - భావితరాల వారికి తెలియజేయడమే ప్రధాన ఉద్దేశ్యం - జిల్లా కలెక్టర్ వివేక్‌యాదవ్



విజయనగరం: తెలుగు ప్రజలు అత్యంత వైభవంగా, ప్రీతిపాత్రంగా నిర్వహించుకునే సంక్రాంతి వేడుకలు స్థానిక అయోధ్య మైదానంలో ఘనంగా నిర్వహించారు. అయోధ్య మైదానాన్ని పల్లె వాతావరణం, స్వచ్ఛమైన తెలుగుదేశం కళ్ళకు కట్టినట్లు తీర్చిదిద్దారు. జిల్లా కలెక్టర్ వివేక్‌యాదవ్, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, ఎమ్మెల్యే డా.కె.నాయుడు, మున్సిపల్ ఛైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, బొద్దల నర్సింగరావు, శ్రీకేష్ లత్కర్ తదితరులు శనివారం సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు.

ముందుగా శాస్త్రోక్తంగా గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భోగి మంటను వెలిగించి చుట్టూ చేరారు. ఆద్యంతం సంక్రాంతి వేడుకలు సంద డిగా జరిగాయి.

**ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష**

అనంతరం జిల్లా కలెక్టర్ వివేక్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో వుండాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని అన్నారు. నేడు అన్ని మున్సిపాల్టీలు, గ్రామ పంచాయితీలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామన్నారు. లక్షలాదిమంది జన్మభూమిలో భాగస్వాములైనందుకు అందరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

గజపతినగరం శాసనసభ్యులు డా.కె.ఎ.నాయుడు మాట్లాడుతూ సాంప్రదాయబద్ధంగా, గ్రామీణ వాతావరణంలో సంక్రాంతి పండుగ జరుపుకుంటున్నామని, మూడు రోజులపాటు పండగ చేసుకోవాలనేది ముఖ్యమంత్రి ఆశయమన్నారు. శాసనమండలి సభ్యులు ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం సంక్రాంతి సంబరాలు జరుగుతున్నాయని, సాంప్రదాయాలు, ఆచారాలు కొనసాగించడం జరుగుతోందన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రసాదుల రామకృష్ణ మాట్లాడుతూ 2014 నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సంక్రాంతి సంబరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకేష్ లత్కర్, కె.నాగేశ్వరరావు, ఆర్.ఎస్.రాజ్ కుమార్, బొద్దుల నరసింగరావు, శ్రీలత, డి.లీలావతి, కళా బృందాలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

DISTANCE EDUCATION
B.a., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., All Groups
GRACE ACADEMY
SBI మేడపైన - సబ్బవరం
77806 64414, 99666 99633

DSC + TET
SGT - & S A Social
Group IV & Group
VRO - VRA
క్లాసులు ప్రారంభమయినవి
GRACE ACADEMY
SBI మేడపైన - సబ్బవరం
77806 64414, 99666 99633

**BEFORE THE HON'BLE DISTRICT JUDGE, ADDITIONAL FAMILY COURT AT VISAKHAPATNAM.**

**I.A.No.160/2016 in F.C.O.P.No.1253/2014**

**Between:**
**DHANALA RAJA RAMESH BABU ...Petitioner/Husband**
**And**
**DHANALA ADI LAKSHMI ...Respondent/Wife**

**NOTICE TO RESPONDENT**

**To:**
**DHANALA ADI LAKSHMI, W/o.Raja Ramesh Babu and d/o Madugula Dharma Rao, House Wife, Hindu, Aged about 24 years, r/o Qtr. No.558, Type-I, Port Quarters, Saligramapuram, Kailasapuram Area, Visakhapatnam-530024.**

Please take notice that the above named Petitioner/Husband has instituted the above numbered I.A.No.160/2016 against you and the same stands posted to **dt.19-02-2018 at 10-30 a.m.,** for your appearance. On that day you are personally or through Advocate attend before the Hon'ble Court at **10-30 a.m.** Failing which the matter will be heard and determined in your absence ex-parte as per law.

**(By Court Order)**

**Y.T.R.RAO, B.sc., B.Ed., LL.B.,**
**G.T.MURTHY & M.V.LAKSHMI,**
**Advocates**
**# 48-7-45/A, Sree Nagar, Vizag-530 016.**
**Mobile :924-6677-924/9290-800-499**
**e-mail : Ytrrao@yahoo.com**

**IN THE HON'BLE COURT OF THE VII ADDL DISTRICT JUDGE VISAKHAPATNAM.**

**A.S.No.102/2016**

**Between:**
**Smt.Peesa Sannayyamma ...Appellants (Defendant No-1)**
**And:**
**Sri.K.V.S.Prakasa Rao and others ...Respondents**

| S.No | Names of the Respondent with address |
|---|---|
| 1. | Sri Koppu Venkata Surya Prakasa Rao, S/o.late Hanumantha Rao, Hindu, aged 63 years, resident of door No.50-56-2, Rajendra Nagar, Visakhapatnam. |
| 2. | Sri Koppu Venkata Janardhana Rao, S/o.late Hanumantha Rao, Hindu, aged 61 years, resident of door No.11-1-21, Near Old Bus Stand, Putchala Veedhi, Vizianagaram. |
| 3. | Sri Koppu Venkata Chirajeevi Rao, S/o.late Hanumantha Rao, Hindu, aged 59 years, resident of door No.11-1-21, Near Old Bus Stand, Putchala Veedhi, Vizianagaram. |
| 4. | Sri Koppu Venkata Sudhakara Rao, S/o.late Hanumantha Rao, Hindu, aged 57 years, resident of door No.11-1-21, Near Old Bus Stand, Putchala Veedhi, Vizianagaram. |
| 5. | Sri Koppu Venkata Ramana Rao, S/o.late Hanumantha Rao, Hindu, aged 56 years, resident of door No.11-1-21, Near Old Bus Stand, Putchala Veedhi, Vizianagaram. |
| 6. | Smt. Koppu Kamala, W/o.late Hanumantha Rao, Hindu, aged 80 years, resident of door No.11-1-21, Near Old Bus Stand, Putchala Veedhi, Vizianagaram. |
| 7. | Sri Koppu Guranna, S/o.late Narasinga Rao, Hindu, aged 78 years, resident of door No.11-1-21, Near Old Bus Stand, Putchala Veedhi, Vizianagaram. |
| 8. | Sri Koppu Venkata Murali Mohana Rao, S/o.late Narasinga Rao, Hindu, aged 56 years, resident of door No.11-1-21, Near Old Bus Stand, Putchala Veedhi, Vizianagaram. |
| 9. | Sri Koppu Venkata Jaganmohana Rao, S/o.late Narasinga Rao, died |
| 10. | Sri Koppu Venkata Seshagiri Rao, S/o.late Narasinga Rao, Hindu, aged 78 years, resident of door No.11-1-21, Near Old Bus Stand, Putchala Veedhi, Vizianagaram. |
| 11. | Sri Koppu Venkata Rama Rao, S/o.late Narasinga Rao, (died) |
| 12. | Sri Koppu Venkata Lakshmana Rao, S/o.late Narasinga Rao, Hindu, aged 54 years, resident of door No.11-1-212, Near Old Bus Stand, Putchala Veedhi, Vizianagaram. |
| 13. | Smt.K.V.Mahalakshmi, W/o.late Jaganmohan Rao, Hindu, aged 39 years, C/o.Koppu Guranna & Sons, Putchala Street, Near Old Bus Stand, Vizianagaram. |
| 14. | Sri.K.V.Narasinga Rao, S/o.late Jaganmohan Rao, Hindu, aged 37 years, Putchala Street, Near Old Bus Stand, Vizianagaram. |
| 15. | Sri.K.V.Vardhan, S/o.late Jaganmohan Rao, Hindu, aged 37 years, C/o.Koppu Guranna & Sons, Putchala Street, Near Old Bus Stand, Vizianagaram. |
| 16. | Smt.S.V.Swathi, W/o.Sri.Venkata Ratnam, Hindu, aged 36 years, C/o.Koppu Guranna & Sons, Putchala Street, Near Old Bus Stand, Vizianagaram. |
| 17. | Smt.K.Venkata Nani, W/o. late Venkata Ramana Rao, Hindu, aged 50 years, House Hold duties, residing at door No.11-1-21, Puthala Veedhi, Vizianagaram. |
| 18. | Sri.Koppu Venkata Hanumanth Srinivas, S/o. late K.Venkata Ramana Rao, Hindu, aged 29 years, resident of door No.11-1-21, Putchala Veedhi, Vizianagaram. |
| 19. | Smt. Koppu Venkata Vasantha Dhanalakshmi, D/o. late Venkata Ramana Rao, Hindu, aged 26 years, resident at door No.11-1-21, Putchala Street, Vizianagaram. |
| 20. | Sri.Peesa Appa Rao, S/o. late Appala Swamy, Hindu, aged 73 years, 1-166/2, Near Car Shed, Pilakavanipalem, Madhurawada, Visakhapatnam. |
| 21. | Smt.Peesa Aruna, W/o.late Rajanna, Hindu, aged 51 years, Door No.1-28, Near Car Shed, Pilakavanipalem, Madhurawada, Visakhapatnam. |

**NOTICE**


Please take notice that the above named Applicant/Petitioner has instituted the above I.A. against the respondents and the same stands posted to **29-01-2018 at 10.30 AM.** For your appearance, on that day you are personally or through advocate attend before the Honourable Court, failing which the matter will be proceed in your absence.

By Court Order

**S.NARAYANA**
**Advocate**
**Visakhapatnam-03**
**Cell Nos: 9848079684 9441484083**

Visakhapatnam
Date:10-01-2018

# యానాం అభివృద్ధికి ఫ్రెంచి ప్రభుత్వం రూ. 38 కోట్లు



యానాం : నియోజకవర్గంలోని ఫ్రెంచి కట్టడాలు అభివృద్ధికి ఫ్రెంచి ప్రభుత్వం రూ. 38 కోట్లు నిధులు మంజూరుచేయనున్నట్లు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు తెలిపారు. ఎర్రాగార్డెన్స్‌లోని ఆయన నివాసంలో ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ఇపిడి స్కీమ్‌ద్వారా ఫ్రెంచి ప్రభుత్వం యానాం అభివృద్ధికి రూ. 37 కోట్ల 64 లక్షలు నిధులు విడుదలచేయనున్నట్లు తెలిపారు. నియోజక వర్గంలో అతిపురాతన ఫ్రెంచి కట్టడాల పరిరక్షణకు నిధులు ఉపయోగించనున్నట్లు తెలిపారు. అంబేద్కర్ నగర్, యానాం పట్టణ ప్రాంతంలోని కనకాలపేట, దరియాలతిప్ప ప్రాంతాలలో ఫ్రెంచి కట్టడాల అభివృద్ధికి నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. వాటర్ ఇరిగేషన్ ద్వారా రూ. 7కోట్ల 90లక్షల 70 వేల లతో ఫ్రెంచి ఇంటర్‌నేషనల్ డ్రైనెజ్ పైప్‌లైన్ పనులకు నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. కనకాలపేట, ఫ్రాన్స్‌తిప్ప, పరంపేట, కనకాలపేట, ఆదిఆంధ్ర పేట రైతులకు, భీమ్‌నగర్ సొసైటీ సభ్యులు దరియాలతిప్ప, ఐ లాండ్ భూములలో ఫ్రెంచి ప్రభుత్వ నిధులతో ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పత్తిగొందు ప్రాదన మంచినీటి కాలువ నుండి ఇసుక కాలువకు వచ్చే దరి యాలతిప్ప పంట కాలు వను తవ్వి వెడల్పు చేసేందుకు రూ. 5 కోట్ల 32 లక్షల 30 వేలతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కనకాలపేట లో రెండుచెరువులు, యానాంలోని నల్ల చెరువులు రెండు, గోపాల్‌నగర్‌లోని 55 ఎకరాలలో రెండు చెరువులు, దరియాలతిప్పలు ఆరు చెరువులు, ఐలాండ్-3లో చెరువులకు మరమ్మత్తు పనులతోపాటు స్టోరేజ్ ట్యాంకుల నిర్మాణం, పిల్లంక నుండి కనకాలపేట వరకు చేపట్టిన భూగర్భ పైప్‌లైన్ పనుల మాదిరిగా రూ. 37 కోట్ల, 20 లక్షలు 55 వేలు తో పనులు చేపట్టేందుకు భారత ప్రభుత్వానికి మూడు సంవత్సరాల క్రితమే ప్రతిపాదనలు ఇవ్వడం జరిగింది. సంవత్సంన్నర క్రింత ఈ పనులకు నిధులు కేటాయించాలని కోరడం జరిగిందన్నారు.

ఈ నెల 16న కేంద్ర మంత్రిని కలిసి చర్చించనున్నామన్నారు. అలాగే ఈనెల 19వ తేదీన కలిసి రెండు ప్రాజెక్టులపై అనుమతులు తీసుకొచ్చేందుకు కృషిచేస్తామన్నారు.

# మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సంక్రాతి సంబరాలు



భీమునిపట్నం : భీమిలి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణ లో సంక్రాతి సంభరాలు అత్యంత ఆహ్లాదాన్ని కలుగ చేసాయి. ఈ కార్యక్రమం లో మండలాధ్యక్షురాలు యరబాల. క్రిష్ణవేణి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. మండలం లోగల వివిద పాటశాలల విద్యార్దులు వేసిన డాన్స్‌లు, నాటికలు, బొమ్మల కొలువులు, ఈ కార్యక్రమంలో చందానా డాన్స్ గ్రూప్ వాళ్ళు ప్రదర్శించిన నాట్యాలు విచ్చేసిన ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఈ సందర్భంగా ఎం.పి.పి. మాట్లాడుతూ విద్యార్ధులు ఎంతో కష్టపడి ఉపాధ్యాయులు సహకారంతో నిర్వహించిన ఈ సంక్రాంతి జాతరను అభినందిం చారు. సంక్రాంతి విశిష్టతను గురించి విద్యార్థు లకు తెలియజేశారు. డాన్స్‌లో పాలుగున్న విద్యార్థులకు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమానికి జడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఎం.పి. డి.ఓ. కె.హరిప్రసాద్ మాజీ. ఎం.పి.పి. గాడు. వెంకటప్పడు,ఎం.పి.టి.సి.లు, సర్పంచ్‌లు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎస్.విధానాన్ని రద్దు చేయాలి.. పాత పింఛను విధాన్ని పునరుద్ధరించాలి

## పింఛను సాధన సమితి డిమాండ్



పిఠాపురం : కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలంటూ పెన్షన్ సాధన సమితి ఆధ్వర్యంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు 300 మందికి పైగా హాజరై పిఠాపురం తహశీల్దారు కార్యాలయం వద్ద భారీ ఎత్తున ధర్నా చేశారు. 2014 సెప్టెంబర్ 1 తర్వాత రాష్ట్ర ప్రభుత్వ కొలువులో చేరిన ఉద్యోగ, ఉపాధ్యాయులందరికి వర్తించే విధంగా సీపీఎప్.విధానాన్ని అమలుపర్చడమైదని ఈ విధానంతో ఉద్యోగి పదవీ విరమణ తర్వాత ఆర్ధిక, సామాజికి భద్రత లేకుండా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఒక లక్షా 80 వేల మంది, జిల్లా 16 వేల మంది ఈ విధానం వల్ల రోడ్డున పడుతున్నారని ఇప్పటి వరకు 150 మందికి పైగా మరణించారని వారికి ఎటువంటి ఆర్ధిక సౌకర్యం అందలేదని, ప్రభుత్వం గ్రాడ్యూటీ, ఫ్యామిలీ పెన్షన్ జీవోలు ఇచ్చినా అవి ఆచరణకు నోచుకోలేదని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ సీపీఎస్. విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులకు మేలు చేయాలని పెన్షన్ సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షులు తుమ్మల రామకృష్ణ, పీఎన్‌వీవీ.సత్యనారాయణ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తోటకూరి చక్రవర్తి, యూటీఎప్ జిల్లా సహ అధ్యక్షుడు కుసుమ మునిప్రసాద్, సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహ అధ్యక్షుడు దువ్వా మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి మంత్రి మల్లాడి పరామర్శ

యానాం : సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దరియాలతిప్ప రైతుసంఘ మాజీ అధ్యక్షుడు చింతా అమ్మిరాజు (బాబూరావు) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆ కుటుంబానికి పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు పరామర్శించి ఒదార్చారు. స్థానిక విక్రేయ నగర్‌లో మృతుని కుటుంబ సభ్యులను కలిసి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. అలాగే గతంలో రైతులకు ప్రజలకు ఆయన చేసిన సేవలను కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ గుర్తుచేసుకున్నారు. దరియాలతిప్ప రైతులకు ఆయన ఎనలేని సేవలు అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో దేవస్థానకమిటీ అధ్యక్షులు గందం శంకరరావు, చింతా రాంబాబు, మాజీ కౌన్సిలర్ జి పరిమళాదేవి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు

తాళ్లరేవు : మండల పరిధిలోని పలు పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. తాళ్లరేవులోని మార్గదర్శి హైస్కూల్, శ్రీ సత్యసాయి స్కూల్, సొల్లంగిపేట వివేకనందా హైస్కూల్, జార్జిపేటలోని విజ్ఞాన స్కూల్‌లో సంక్రాంతి సంబారాలలో భాగంగా పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రాంగణాలలో ముగ్గులపోటీలు నిర్వహించారు. అలాగే బోగిపళ్ళు, గొబ్బమ్మలు, భోగి మంటలతో సంబరాలను ఘనంగా నిర్వహించారు. సొల్లంగిపేట శ్రీ వివేకనంద పాఠశాలలో భారీ భోగి పిడకలదండను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహకంగా పాల్గొన్నారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందచేశారు.

## అంబేద్కర్ విజ్ఞాన భవన నిర్మాణానికి మార్కింగ్



యానాం : స్థానిక గోపాల్ నగర్‌లో మత్స్యకార కార్యలయం వెనుక చేపట్టిన అంబేద్కర్ విజ్ఞాన భవన నిర్మాణ పనులకు అధికారులు మార్కింగ్ పనులు చేపట్టారు. శనివారం విజయవాడకు చెందిన కోస్టల్ ల్యాండ్ సర్వే అధికారుల బృందం ఈ ప్రాంతాన్ని సందర్శించి భవన నమూనాకు అనుగుణంగా మార్కింగ్ పనులు చేపట్టారు. పుదుచ్చేరి ప్రభుత్వం ద్వారా సుమారు రూ. 5 కోట్లతో చేపట్టే ఈ పనులకు మార్కింగ్ చేపట్టడంతో పనులు ప్రారంభం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు కృషి మేరకు నిధుల కేటాయింపుతో ఈ పనుల చేపట్టారు. కార్యక్రమంలో కోస్టల్ ల్యాండ్ సర్వే అధికారులతోపాటు, ప్రజాపనులశాఖ అధికారులు, కాంట్రాక్టర్లు, తదితరుల పాల్గొన్నారు.

## దిగ్విజయంగా సాగిన నగరసంకీర్తన

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వాసవి క్లబ్, వనిత క్లబ్ ల ఆద్వర్యంలో ధనుర్మాసము సందర్భంగా గత 26 రోజుల నుండి అన్నవరం పురవీధులగుండా తెల్లవారుఝాము నుండి ఏకదాటిపైన నగరసంకీర్తన కార్యక్రమాన్ని హరిరామ స్మరణతో 26 రోజులు నిర్విరామంగా ఆర్యవైశ్యులు,గ్రామస్థులు, వాసవి క్లబ్, వనితా క్లబ్ వారు నగర సంకీర్తనను మేళతాళాలు,బాజా భజంత్రీల నడుమ పండుగకల ఉట్టి పడేటట్టు ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేసారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రెసిడెంట్ రమేష్,సెక్రటరీ రాజేష్, ట్రైజరర్ బోనగిరి.శ్రీనివాస్ మరియు వనితా క్లబ్ ప్రెసిడెంట్ నేతి.మమత, వరలక్ష్మి, అనూరాధ, కుమారి, రజని, వీరలక్ష్మి, జ్యోతి మరియు ఆర్యవైశ్య పెద్దలు దాసరి.సత్యనారాయణ, నగేష్, గణేష్, నేతి.బాబి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పండుగ సందర్భంగా కిక్కిరిసిన రోడ్లు



రావులపాలెం: తెలుగు ప్రజలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునే పండుగల్లో సంక్రాంతి పండుగ ఒకటి. ఈ పండుగ పురస్కరించుకొని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ఉద్యోగులు, వ్యాపారులు వారి వారి స్వంత గ్రామలకు వచ్చి పండుగ చేసుకోవడం తెలుగు వారి ఆనవాయితీ. ఈ పండుగలు పురస్కరించుకొని గత రెండు రోజులుగా పెద్ద ఎత్తున స్వంత ఇండ్లకు చేరుకునే వారితో రహదారులన్నీ కిక్కిరిసాయి. ముఖ్యంగా జాతీయ రహదారిపై భారీ స్థాయిలో వాహనాలు ఎక్కడిక్కడే ఆగిపోయాయి. దీంతో ఒకింత ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈతకోట టోల్‌ప్లాజా వద్ద వాహనాలు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి రోడ్లు కిక్కిరిసాయి. రావులపాలెం సెంటరులో ఇతర ప్రాంతాలకు వెళ్ళేవారు, ఇతర ప్రాంతాల నుండి ఇక్కడకు వచ్చేవారితో బస్టాండు ప్రాంగణం ప్రయాణికులతో కిటకిటలాడింది.

## వెదిరేశ్వరం పంచాయితీకి ఉత్తమ అవార్డు

రావులపాలెం: 2018 సం॥రం జనవరి నెలలో జరిగిన జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో మండల పరిధి వెదిరేశ్వరం ఉత్తమ గ్రామ పంచాయితీగా ఎన్నికైందని సర్పంచ్ కాశి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలో అన్ని గ్రామాల్లో జన్మభూమి మాఊరు కార్యక్రమాలు జరుగగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకుగాను తమ పంచాయితీ ఉత్తమ గ్రామపంచాయితీగా ఎన్నికైందని ఆయన అన్నారు. ఈ సందర్భముగా కాకినాడ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చిన రాజప్ప, కలెక్టరు కార్తికేయ మిశ్ర చేతలమీదుగా కార్యదర్శి అన్వర్ ఈ అవార్డును అందుకున్నారు. తమ పంచాయితీ ఉత్తమ పంచాయితీగా ఎన్నిక కావడం పట్ల ఎమ్‌పిపి కోట చెల్లయ్య, వైస్ ఎమ్‌పిపి దండు వెంకట సుబ్రహ్మణ్యవర్మ, ఈఓపిఆర్‌డి దుర్గా ప్రసాద్‌లు అభినందించారు.

# రత్నగిరిపై సంక్రాంతి సంబరాలు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం రత్నగిరి కొండపై సంక్రాంతి సంబరాలు భోగి మహోత్సవం నేడు అత్యంత వైభవంగా నిర్వహించుటకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు.తుని తపోవనం శ్రీ సచ్చిదానంద సరస్వతి మహాస్వామి వారి చేతుల మీదుగా భోగి మంట ప్రజ్వలన రత్నగిరి కొండపై రామాలయం ఎదురుగా గల ఆవరణలో నిర్వహించెదరు. శ్రీ సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో భక్తులకు,గ్రామస్థులకు, పల్లె వాతావరణాన్ని కలుగచేసే విధంగా భోగి పండుగ ఉత్సవాన్ని కొండపై నందు రామాలయం ఎదురుగా నిర్వహించే ఈ కార్యక్రమంలో భోగిమంట ఏర్పాటు, హరిదాసు, కొమ్మదాసు, జంగందేవర, గంగిరెడ్ల ప్రదర్శన, కోలాటం, మేలుజాతి ఆవులు, గిత్తలు, యడ్లబండి, కోడిపుంజు మరియు అశ్వ ప్రదర్శన వంటి కార్యక్రమాలు మరియు ముత్తదువులతో పాలు, చెక్కెరను కలిపి పొంగలిని తయారు చేసి ప్రత్యక్ష దైవమైన సూర్యనారాయణ స్వామివార్కి నైవేద్యము సమర్పణ వంటి కార్యక్రమాలు జరుగును.

తదుపరి ముగ్గుల పోటీలలో నెగ్గిన విజేతలకు కార్యనిర్వహణాధికి, చైర్మెన్, పాలక మండలి సభ్యులచే బహుమతులు ప్రధానం చేయుబడును. కావున గ్రామస్థులు, భక్తులు, దేవస్థానం సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామివారి ప్రసాదము స్వీకరించాలని ఆలయ సహయ కార్యనిర్వణాధికారి పిఆర్వో తలా. రాముడు తెలిపారు.

## మత్స్యకారులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని ధర్నా



భీమునిపట్నం : తగరపువలస మత్స్యకారులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలనీ స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సుమారు 300 మంది మత్స్యకారులు రాస్తారోకో, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమిలి మత్స్యకారులు సంఘం అధ్యక్షుడు గంటానూకరాజు మాట్లాడుతూ తీరప్రాంత మత్స్యకారులు చాలా దుర్భర స్థితులు అనుభవిస్తున్నారనీ, సముద్రంలో చేపలు పట్టడానికి వెళ్లి చాలా ఇబ్బందులు పడుతున్నారనీ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మత్స్యకారులను గుర్తించి ఎస్టీ జాబితాలోకి చేర్చాలనీ డిమాండ్ చేసారు. వీరికి వైఎస్ ఆర్ సి పి సమన్వయకర్త అక్కరమాని విజయ నిర్మల, సిపిఐ నాయకులు అల్లు బాబూరావు సంఘీభావం తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో మత్స్యకారుల నాయకులు దౌళపల్లి.కొండబాబు, అల్లిపిల్లి.నరసింగరావు, వాసుపల్లి.కొండబాబు, కదిరి.ఎల్లాజీ, సింగిడి.గణేష్, కె.ఎల్లాజి, దోని. నాగరాజు, మూగి నాగరాజు, కదిరి.జగన్నాదం, వి.గరగయ్య, కాసరపు.నాగరాజు, మట్టా కొండ, కొక్కిరి.అప్పన్న, మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

## సిఆర్‌సి ఆధ్వర్యంలో

# కోనసీమ కబడ్డీ టోర్నమెంట్

రావులపాలెం: రావులపాలెం సిఆర్‌సి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో భాగంగా పండుగ మూడు రోజులు నిర్వహించే కోనసీమ కబడ్డీ పోటీలుకు సర్వం సిద్ధం చేసినట్లు సిఆర్‌సి అధ్యక్ష, కార్యదర్శులు మల్లిడి కనికిరెడ్డి, కర్రి అశోక్‌రెడ్డిలు తెలిపారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. పోటీలలో ఉత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి క్రీడలకు సిఆర్‌సి క్రీడా విభాగం ప్రోత్సహిస్తుందని అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరిగే ఈ కోనసీమ కబడ్డీ పోటీలలో అండర్ 25 మెన్ & ఉమెన్ క్రీడాకారులు పాల్గొంటారని, 17 మెన్, 12 ఉమెన్ జట్లును కోనసీమ వ్యాప్తంగా 16 మండలాల్లో ఎంపిక చేసినట్లు, ఈ పోటీలు నాకౌట్ పద్దతిలో జరుగుతాయన్నారు. ఈ పోటీలు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు కొనసాగుతాయని, పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.25 వేలు, 2వ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలతో పాటు విన్నర్స్, రన్నర్స్‌లకు కన్సోలేషన్ బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భముగా క్రీడాకారులకు సిఆర్‌సి ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పి స్తున్నట్లు తెలిపారు. సిఆర్‌సి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్రీడా పోటీలకు క్రీడాప్రాంగణాన్ని తీర్చిదిద్దడంతో పాటు వీక్షకుల కోసం గ్యాలరీలు ఏర్పాటు చేసామన్నారు. ఈ సమావేశంలో సిఆర్‌సి స్పోర్ట్స్ డైరక్టర్ మల్లిడి వీరరాఘవరెడ్డి, కబడ్డీ పోటీల పర్యవేక్షకులు పివియస్ సూర్యకుమార్, డైరక్టర్ కర్రి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి భరోసా

## - ఎమ్మెల్యే వాసుపల్లి



విశాఖపట్నం : పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరాసా అందిస్తుందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. అనారోగ్యం భారిన పడిన వారు ఆందోళన చెందవద్దని వారిని సీఎం సహాయనిధి, ఎన్టీఆర్ ఆరోగ్య సేవతో ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా అనారోగ్యం బాధపడుతూ వైద్యం చేయించుకునే స్థోమతలేని 27వ వార్డుకు చెందిన సూర్యప్రకాశ రావుకు రూ. 83600/-లు, మహమ్మద్ రజియా బేగంకు రూ. 30 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బాపూ ఆనంద్, జిల్లా నాయకులు రామానంద్, కర్రి ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# చిత్రభాను


## బిల్డింగ్‌పై నుంచి దూకి...



కిడ్నాప్ చేశాడు. ఆ ఘటన 2009లో జరిగింది. నేను షూటింగ్‌లో పాల్గొనేందుకు కోయంబత్తూరుకు వెళ్లాను. ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే మీ డ్రైవర్‌ను నేనే అని ఓ వ్యక్తి వచ్చాడు. నేను, మేనేజర్ నిజమే అనుకొని వాహనంలో ఎక్కి కూర్చున్నాం. నేను హెడ్‌ఫోన్స్ పెట్టుకొని పాటల వింటూ నిద్రపోయాను. అభిమాని కిడ్నాప్ చేసి పెళ్లి.. ఎంతకీ మేము చేరుకోవాల్సిన స్పాట్ రాకపోవడంతో అనుమానం వచ్చింది. డ్రైవర్ విచిత్ర ప్రవర్తన కూడా సందేహం కలిగించింది. అంతలోనే నా వాహనాన్ని ఐదారు వాహనాలు వెంటాడాయి. ఆ తర్వాత ఏమిటని అడిగితే మీరు కిడ్నాప్ అయ్యారు అని నా మేనేజర్ చెప్పాడు. నన్ను కిడ్నాప్ చేసి నా అభిమాని నన్ను పెళ్లి చేసుకోవాలనుకొన్నాడు. రెండుసార్లు సూసైడ్‌కు.. నా జీవితంలో రెండుసార్లు సూసైడ్ చేసుకోవాలనుకొన్నాను. ఎన్నో ఏళ్లుగా ఓ వ్యక్తితో లవ్‌లో ఉన్నాను. ఆ వ్యక్తి దూరం కావడం వల్ల నేను శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా నష్టపోతున్నానే ఫీలింగ్ కలిగింది. బ్రేకప్‌తో కుంగిపోయాను.. లవ్ బ్రేకప్ జరగడంతో సినిమా అవకాశాలు పూర్తిగా కోల్పోయాను. సుమారు నాలుగు నెలలు ఇంటి నుంచి బయటకు రాలేదు. మానసికంగా కుంగిపోయాను. అలాంటి పరిస్థితుల్లో ఈ జీవితం వద్దనుకొన్నాను. బిల్డింగ్ పైనుంచి దూకి అలా లవ్ బ్రేకప్ జరిగిన సమయంలో నేను సూసైడ్ చేసుకోవాలనుకొన్నాను. ఓ రోజు ఏడంతస్తులు అపార్ట్‌మెంట్ మీద నుంచి దూకి చావాలనుకొన్నాను. కానీ ధైర్యం చాలాలేదు. ధైర్యం తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్న సమయంలో నా బాధ్యతలు గుర్తు వచ్చాయి. నా కుటుంబం గుర్తొచ్చింది. వెంటనే ఆ ప్రయత్నం మానుకొన్నాను. నిద్రమాత్రలు మింగి చనిపోవాలని.. మరోసారి కూడా నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకోవాలనుకొన్నాను. ఒక్కోసారి మూడు నిద్ర మాత్రలు తెచ్చుకొని మొత్తం 60 స్లీపింగ్ పిల్స్ సిద్ధం చేసుకొన్నాను. కానీ ఆ ప్రయత్నాన్ని కూడా విరమించుకొన్నాను. బ్రేకప్ తర్వాత వీరా పరిచయం అలా నా బ్రేకప్ జరిగి నేను పూర్తిగా డిప్రెషన్‌లో ఉన్న సమయంలోనే వీరాతో పరిచయం జరిగింది. ఆ సమయానికి వీరాకు కూడా బ్రేకప్ జరిగి బాధలో ఉన్నాడు. అలా మా మధ్య జరిగిన పరిచయం వల్ల పాత విషయాలను మరిచిపోయాం. మా మనసులు కలిశాయి. బిగ్‌బాస్ రియాలిటీ షో నుంచి వచ్చిన తర్వాత నన్ను పెళ్లి చేసుకొంటాను అని వీరా ప్రపోజ్ చేశాడు అని నమిత వెల్లడించింది.

తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయమైన నమిత దక్షిణాదిలో అగ్రతారగా వెలుగొందింది. తమిళ ప్రేక్షకులు ఆమె గ్లామర్‌కు నీరాజనం పట్టి గుడి కూడా నిర్మించారు. ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించిన నమిత ఇటీవల ప్రేమించిన వీరాను పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకొన్నది. ఇటీవల ఓ య్యూట్యూబ్ ఛానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు. నాకు నాగార్జున అంటే చాలా ఇష్టం. తొలిసారి ఓ హీరోను చూసి అభిమానించింది. ప్రేమించింది నాగార్జుననే. 9 ఏళ్ల వయస్సు ఉన్నప్పుడు ఖుదాగవా చిత్రంలో నాగార్జున చూసి ఫిదా అయిపోయాను. భగవంతుడు నా కోరికను విని నాగ్ లాంటి వీరాను భర్తగా ఇచ్చాడేమో. అందుకే ఆయనతో పెళ్లి.. తాళి తప్ప మరో మార్పు లేదు..! గుడి కడితే తప్పేంటీ? అభిమానులు నాకు గుడి కట్టడాన్ని నేను సమర్థిస్తాను. ఎందుకంటే వారి ప్రేమకు అది గుర్తు. నాపై ఉన్న అభిమానాన్ని నేను కాదనలేను. అందుకే వారు నాకు గుడికట్టారు. తన ప్రేమను చాటుకోవడానికి షాజహాన్ తాజమహల్ కట్టాడు. అలాంటిదే ఇది. అందుకే నాపై ప్రేమ నేను ఎప్పుడూ అభిమానులతో టచ్‌లో ఉంటాను. వారితో ఎప్పటికప్పుడూ మాట్లాడుతుంటాను. నా ఆరోగ్యం బాగా లేకున్నా వారు అడిగితే వెంటనే ఫొటో దిగుతాను. యాటిట్యూడ్ చూపించను. అందుకే నా అభిమానులు నాపై ఎంతో ఎంతో ప్రేమ కురిపిస్తారు. అభిమాని కిడ్నాప్ చేశాడు.. నా జీవితంలో ఓ విచిత్రమైన సంఘటన ఎదురైంది. నా అభిమాని ఒకరు నన్ను

## వాళ్లు దేవుళ్లైతే.. నేనూ దేవుడ్నే..!



'రామాయణంలో రాముడికి, రావణాసురుడికి మధ్య గొడవ. మహాభారతంలో పాండవులకు, కౌరవులకు మాత్రమే గొడవ. వాళ్లూ వాళ్లూ కొట్టుకుని ఎవరో ఒకరు చనిపోయి ఉంటే బాగుండేది. కానీ, వాళ్ల మూలంగా జరిగిన యుద్ధంలో అటు, ఇటు కొన్ని లక్షల మంది సైనికులు చనిపోయారు. పురాణాల్లో వాళ్లు చేసింది తప్పయితే ఇక్కడ నేను చేసింది కూడా తప్పే. అక్కడ వాళ్లు దేవుళ్లైతే ఇక్కడ నేనూ దేవుడ్నే. అర్థం చేసుకుంటారో, అపార్థం చేసుకుంటారో.. ఛాయిస్ ఈజ్ యువర్స్' అంటున్నారు మోహన్‌బాబు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గాయత్రి'. ఈ సినిమా టీజర్‌ను శనివారం మధ్యాహ్నం విడుదల చేశారు. ఇందులో మోహన్‌బాబు పవర్‌ఫుల్ లుక్‌లో, తనదైన డైలాగ్ డెలివరీతో ఆకట్టుకున్నారు. ఆర్.మదన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మోహన్‌బాబు నిర్మాత. విషు?, శ్రియ, అనసూయ, నిఖిలా విమల్, బ్రహ్మానందం, పోసాని క ృష? మురళీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో మోహన్‌బాబు కుమార్తెగా నిఖిల, జర్నలిస్టుగా అనసూయ కనిపించనున్నారు. త్వరలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

## కేవలం వారితోనే.. చేస్తా



ఎప్పుడూ సంచలనాల కోసం వెంపర్లాడే ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ తాజాగా చిత్రం జీఎస్టీ (గాడ్, సెక్స్, అండ్ ట్రూత్). ఈ చిత్రంలో పోర్న్‌స్టార్ మియా మల్కోవా నగ్నంగా నటించింది. ఈ చిత్రానికి సంబంధించిన ఫొటోలు ఇంటర్నెట్‌లో దుమారం లేపాయి. రాంగోపాల్ వర్మ తెరకెక్కించిన గాడ్ సెక్స్ అండ్ ట్రూత్ గురించి మియా మల్కోవా ట్విట్టర్‌లో స్పందించారు. రాంగోపాల్ వర్మ గురించి వెల్లడిస్తూ ఆమె ట్వీట్ చేసింది. మియా మల్కోవా గురించి మీకు తెలియని కొన్ని విషయాలు.. ఇండియన్ డైరెక్టర్ రాంగోపాల్ వర్మ నాపై యూరప్‌లో ఓ వీడియో షూట్ చేశాడు. దాని పేరు గాడ్, సెక్స్ అండ్ ట్రూత్. సన్నీలియోన్ తర్వాత భారతీయ సినిమా పరిశ్రమకు పరిచయమైన రెండో పోర్న్‌స్టార్‌ను నేను అని మల్కోవా ట్వీట్ చేసింది. సోదరుడు కూడా పోర్న్‌స్టార్ మియా మల్కోవా 1992లో అమెరికాలోని కాలిఫోర్నియాలో జన్మించింది. ఆమె మూలాలు ఫ్రెంచ్, కెనడా, జర్మన్, ఐరిష్ దేశాల్లో ఉన్నాయి. ఆమె సోదరుడు జస్టిన్ హంట్ కూడా పోర్న్ స్టార్ కావడం గమనార్హం. మహిళలతో బూతు చిత్రాలు 2014లో సహనటుడు డేనియల్ మౌంటేన్‌ను వివాహం చేసుకొన్నారు. పురుషులతో కాకుండా మహిళలతోనే బూతు చిత్రాలను నిర్మించాలనే ఉద్దేశంతో ఆ మధ్య సొంతంగా ఓ ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించింది. పోర్న్ చిత్రాల నుంచి పెళ్లి తర్వాత పోర్న్ సినిమాల నుంచి వైదొలగాలని నేను, నా భర్త నిర?యించుకొన్నాం అని 2014లో ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. అయితే అవకాశాలు భారీగా రావడంతో ఆ నిర?యాన్ని విరమించుకొన్నాం అని మల్కోవా వెల్లడించింది. మల్కోవా నటించిన సినిమాలు ది ప్రీచర్స్ డాటర్, పీటర్ పాన్ ట్రిపుల్ ఎక్స్ లాంటి చిత్రాల్లో మల్కోవా నటించింది. జపాన్ చిత్ర పరిశ్రమలో కూడా కొన్ని సినిమాల్లో నటించింది. ఉత్తమ నటి అవార్డులు క్యూటీ3, గర్ల్ క్రష్3 చిత్రాల్లో నగ్న సన్నివేశాల్లో అదుతేంగా నటించిందుకు గాను ఆమె ఉత్తమ అవార్డులను కూడా అందుకొన్నది. అసభ్య కార్యక్రమాలకు పాల్పడినందుకు అమెరికాలో ఓ సారి మల్కోవాను అరెస్ట్ కూడా చేశారు. నాతోపాటు నా తల్లి కూడా బూతు చిత్రాల్లో నటిస్తే సాధారణంగా తల్లిదండ్రులు అడ్డు తగులుతారు. కానీ నా తల్లి నాకు పూర్తి సహకారం అందిస్తుంది. నేను నటించిన చిత్రాలను నాతో కలిసి నా తల్లి కూడా చూస్తుంది అని మల్కోవా తెలిపింది. సేఫ్ సెక్స్ గురించి ఆమె ప్రచారం కూడా చేపట్టింది.



చిరంజీవి న్యూలుక్

## తమన్నా పెళ్లికి తొందరపడుతోందా...?



బాహుబలి చిత్రంలో పచ్చబొట్టు వేయించుకున్న పాలపిల్ల తమన్నాపై బాలీవుడ్ ఇండస్ట్రీ గుసగుసలు పోతోంది. తమన్నా పెళ్లికి రెడీ అవుతోందనీ, పెళ్లి తర్వాత సినిమాలు చేయదనీ ఏదో రాసేస్తుంది. కాగా తాజాగా తమన్నా నటించిన ఊపిరి చిత్రం సూపర్ సక్సెస్ సాధించి ముందుకు వెళుతోంది. ఈ దశలో తమన్నా పెళ్లి చేసేసుకుంటుందంటే నమ్మడం కష్టమే మరి. చూద్దాం... నటి అసిన్‌లా ఝలక్ ఇస్తుందేమో...?



## మళ్లీ ఊహించని సర్‌ప్రైజ్..

అర్జున్ రెడ్డి పాత్రలో విజయ్ దేవరకొండ నటనకు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టిన సంగతి తెలిసిందే. టాలీవుడ్‌ను షేక్ చేసిన ఆ సినిమాతో విజయ్ తనకంటూ ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పరుచుకున్నాడు. సినిమాలతోనే కాదు, వ్యక్తిగతంగాను అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాడు విజయ్. అర్జున్ రెడ్డి సమయంలో రోడ్డుపై తన బొమ్మ అభిమానాన్ని చాటుకున్న ఫైన్ ఆర్ట్స్ స్టూడెంట్స్‌ను తాజాగా విజయ్ కలుసుకున్నాడు. ఆ విశేషాలు మీకోసం.. అర్జున్ రెడ్డి హిట్ తర్వాత కొంతమంది ఫైన్ ఆర్ట్స్ స్టూడెంట్స్.. రోడ్డుపై రంగులతో విజయ్ దేవరకొండ చిత్రాన్ని గీశారు. తన పట్ల అభిమానాన్ని చాటుకున్న విద్యార్థులను సర్ ప్రైజ్ చేయడానికి వెళ్లాడు విజయ్. ముందస్తు సమాచారం ఇవ్వకుండా నేరుగా క్యాంపస్ లోకి ఎంట్రీ ఇచ్చి వారిని ఆశ్చర్యానికి గురిచేశాడు. ఫైన్ ఆర్ట్స్ స్టూడెంట్స్‌కు సర్‌ప్రైజ్ ఇచ్చిన విషయాన్ని విజయ్ దేవరకొండ తన ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. దానికి సంబంధించిన వీడియోను కూడా పోస్టు చేశారు. 'నూతన సంవత్సరానికి నేను ఇక్కడ ఉండను. అందుకే అందర్నీ ఇప్పుడే కలిసి, హ్యాపీ చేసి వెళ్లిపోవాలి' అని ఆ వీడియోలో విజయ్ పేర్కొనడం విశేషం. వీడియోలో విజయ్ క్రేజీ లుక్స్‌లో కనిపించాడు. తలకు క్యాప్ పెట్టుకుని స్టూడెంట్స్ తో కలిసి సందడి చేశాడు. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో వారికి గిఫ్టు ఇచ్చి మరింత సర్ ప్రైజ్ చేశాడు. విజయ్ ని చూడగానే యువకులంతా కేకలు, అరుపులతో హంగామా చేశారు. స్టూడెంట్స్ తో గడపడం అద్భుతంగా అనిపించిందని తెలిపాడు. విజయ్ దేవరకొండ ప్రస్తుతం సావిత్రి బయోపిక్ 'మహానటి'తో పాటు, 'ఏ మంత్రం వేసావె', 'ట్యాక్సీవాలా', సినిమాల్లో నటిస్తున్నారు.

## ఐపీఎల్ వేలం..

# 1122 మంది క్రికెటర్ల రిజిస్ట్రేషన్




దిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2018 వేలానికి సిద్ధమవుతోంది. ఇందుకోసం క్రిస్‌గేల్, యువరాజ్ సింగ్, జాయ్ రూట్, షేన్ వాట్సన్‌తో పాటు దాదాపు 1122 మంది క్రికెటర్లు తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. ఈ విషయాన్ని శనివారం బీసీసీఐ అధికారికంగా వెల్లడించింది. బెంగళూరు వేదికగా జనవరి 27, 28 తేదీలో ఐపీఎల్ వేలం జరుగుతుంది. ఈ వేలంలో భారత క్రికెటర్లు గౌతమ్ గంభీర్, అశ్విన్, అజింక్య రహానే, స్పిన్ మాంత్రికుడు కుల్దీప్ యాదవ్, ఓపెనర్లు కేఎల్ రాహుల్, ఎం.విజయ్‌ను ఎవరు కొనుగోలు చేస్తారా అని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు గంభీర్‌ను అట్టి పెట్టుకోకుండా వదిలేసింది. దీంతో గౌతీని ప్రస్తుతం ఎవరు కొనుగోలు చేస్తారనేదీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆటగాళ్ల జాబితాను ఎనిమిది ఐపీఎల్ ఫ్రాంచైజీలకు పంపించారు. వీరిలో 281 మంది క్యాప్‌డ్ ప్లేయర్లు, 838 మంది అన్‌క్యాప్‌డ్ ప్లేయర్లు. వీరిలో 778 మంది భారతీయులు, అసోసియేట్ దేశాలకు చెందిన ముగ్గురు ఆటగాళ్లు ఉన్నట్లు బీసీసీఐ వెల్లడించింది. ఆస్ట్రేలియా (58), దక్షిణాఫ్రికా (57), శ్రీలంక (39), వెస్టిండీస్ (39), న్యూజిలాండ్ (30), ఇంగ్లాండ్ (26)కు చెందిన ఆటగాళు ఐపీఎల్ వేలంలో తమ పేర్లను నమోదు చేసుకున్నారు.

ఐపీఎల్ పదో సీజన్‌లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ తరపున రెండు శతకాలను నమోదు చేసిన హసీమ్ ఆమ్లా... తన దేశానికే చెందిన డుప్లెసిస్, డీకాక్, డేవిడ్ మిల్లర్, మోర్నె మోర్కెల్, రబాడాతో పోటీగా ఈ వేలంలో అత్యధిక ధర పొందే అవకాశం ఉంది. ఈ ఏడాది ఐపీఎల్-11వ సీజన్ ఏప్రిల్ 4న ప్రారంభమై మే 31తో ముగియనుంది.

ఏ ఆటగాళ్లు ఏ జట్టులో ఆడతారో, కొత్త ఆటగాళ్ల ఎవరు వస్తారో.. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లో ఎవరు అత్యధిక ధర పలుకుతారో తెలియాలంటో మరికొన్ని రోజులు ఆగాల్సిందే.

# తెలుగు లోగిళ్లలో ఆనందం విరబూయాలి : సీఎం



అమరావతి: అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, తెలుగు లోగిళ్లలో ఏడాదంతా ఆనందం వెల్లివిరియాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు దేశ, విదేశాల్లోని తెలుగు ప్రజలకు ఆయన భోగి, మకర సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పారు. పేదవాళ్లు సైతం సంతోషంగా పెద్ద పండుగ చేసుకోవాలన్న ఉద్దేశంతోనే చంద్రన్న సంక్రాంతి కానుక పంపిణీ చేసినట్టు చెప్పారు. సంక్రాంతి ప్రధానంగా రైతుల పండుగ అని, పంట ఇంటికి చేరిన సందర్భంలో ప్రకృతికి కర్షకులు నివేదించే కృతజ్ఞతల పండుగ అని చంద్రబాబు అభివర్ణించారు. సాగు వ్యయాన్ని తగ్గించడం, ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం, అనుబంధ రంగాలకు ప్రాధాన్యతనిస్తూ కోటి ఎకరాల్లో ఉద్యాన పంటలు పండించడం తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంటికి చేరిన ధాన్య రాశులతో తెలుగు లోగిళ్లు కళకళలాడుతున్నాయని చెప్పారు. పట్టిసీమ ద్వారా మూడేళ్లలో కృష్ణా డెల్టాలో 13లక్షల ఎకరాల్లో రూ.18వేల కోట్ల విలువె%న పంట ఇంటికి చేరిందని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. ఇటీవల ముగిసిన ఐదో విడత జన్మభూమి - మావూరు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేసిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్రాన్ని కరవు రహిత ఆంధ్రప్రదేశ్‌గా చేస్తామని మూడేళ్ల నాడు చెప్పిన మాటల్ని నిజం చేస్తున్నామని, కృష్ణా జలాలతో రాయలసీమలో చెరువులను నింపినట్టు చెప్పారు.

అనంతపురం జిల్లాలో నిండిన చెరువులను చూస్తే సముద్రాన్ని చూసినంత సంతోషంగా ఉందన్నారు. పట్టిసీమ పథకం విజయస్ఫూర్తితో కృష్ణా -గోదావరి- పెన్నా నదుల అనుసంధానం చేస్తామన్నారు.

# సెరిమోనియల్ లాంజ్‌కు చంద్రబాబు శంకుస్థాపన

తిరుపతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం మధ్యాహ్నం తిరుపతిలో పర్యటించారు. ఈ సందర్భంగా తిరుపతి విమానాశ్రయంలో ప్రముఖులు వేచి ఉండేందుకు నిర్మించనున్న సెరిమోనియల్ లాంజ్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం రేణిగుంటలో ఐటీ పరిశ్రమ జోహోను ప్రారంభించారు. అలాగే కరకంబాడీ రోడ్డులోని సరోవర్ హోటల్ వద్ద డిసిగ్నేటెడ్ ఐటీ హబ్‌ను ప్రారంభించనున్నారు. అనంతరం నారావారి పల్లెకు చేరుకుంటారు. మూడు రోజులపాటు సంక్రాంతి వేడుకల్ని అక్కడే జరుపుకోనున్నారు.

# అండర్ 19 వరల్డ్ కప్ కివీస్ శుభారంభం



న్యూజిలాండ్: అండర్ 19 వరల్డ్ కప్‌లో భాగంగా వెస్టిండీస్‌తో శనివారం జరిగిన ఆరంభపు మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. అన్ని విభాగాల్లో ఆకట్టుకున్న న్యూజిలాండ్ శుభారంభం చేసింది. వెస్టిండీస్ నిర్దేశించిన 234 పరుగుల లక్ష్యాన్ని కివీస్ 39.3 ఓవర్లలో రెండు వికెట్లతో ఛేదించి సునాయాస విజయాన్ని సొంతం చేసుకుంది. న్యూజిలాండ్ ఆటగాళ్లలో అలెన్(115 నాటౌట్) అజేయ శతకంతో సత్తాచాటి విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. అంతకుముందు ఓపెనర్ భులా(83) హాఫ్ సెంచరీతో మెరిశాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 50 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 233 పరుగులు చేసింది. సిమ్మన్స్(92 నాటౌట్), మెలియస్ (78) మినహా ఎవరూ ఆకట్టకోలేకపోవడంతో విండీస్ మోస్తరు స్కోరుకే పరిమితమైంది.




# ప్రపంచమొక కుగ్రామం...అయినా పంక్రాంతి శోయగం...



కాలం నదిలాంటిది. నిత్య ప్రవహిస్తూనే వుంటుంది. సనాతన సంప్రదాయాలను విస్మరించకుండా....నానాటికీ వాటి ఔన్నత్యాన్ని...ఆవశ్యకతను ఎలుగెత్తి చాటుతూనే వున్నారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో ప్రభుత్వం కూడా ఈ బాధ్యతను బుజాన వేసుకోవటం గమనార్హం. ప్రాశ్చాత్య పోవకడల నుంచి మనని మనంకాపాడుకునేందుకు చేస్తున్న ఈ ఒరవడి భావితరాలకు మన సంస్కృతిపట్ల గౌరవాన్ని నిలబెట్టేందుకు ఎంతగానో దోహదపడుతుంది. భోగీ, సంక్రాంతి, కనుమ ఇలా మూడురోజులు ఒకేసారి పండగలుజరుపుకోవటం ఏ సంప్రదాయాల్లో మనకు కన్పించదు. భౌతిక, భౌగోళిక, మార్పుటకు తగ్గట్టుగా పండగలను మలచుకోవటం కేవలం మనదేశంలోనే కన్పిస్తుంది.

### కళాత్మకత... సంక్రాతి ప్రత్యేకత

గంగిరెద్దులు, హరిదాసులు, ఇంటి ముంగిట రంగుల ముగ్గులు, మామిడి తోరణాలు, చెరుకు గడలు, పిండివంటలు, సూర్యుడుకి నైవేద్యం చేసిన కొత్త బియ్యపు పొంగలి అన్నీ కొనసాగుతూనే వున్నాయి. వాస్తవంలో ఈ పండుగను నగర వాసులు అనుభవించక పోయినా, చాలామంది రచయితలు, కవులు చిత్రదర్శకులు మనసంస్కృతి, సంప్రదాయాలను మనకు పున:ప్రతిష్టించటానికి ఎన్నో ప్రక్రియలను, మాద్యమాలను వినియోగించారు. వ్యక్తులు మన తెలుగు సంక్రాంతి సంబరాలను, సంప్రదాయాలను ప్రతిబింబించేలా చిత్రీకరించిన ఆంధ్ర రాష్ట్రం లో నాలుగు రోజుల పాటు ఈ పండుగను చేస్తారు. అవి ...మొదటి రోజు 'భోగి', రెండవ రోజు 'మకర సంక్రాంతి . మూడవ రోజు 'కనుమ', చివరి రోజు లేదా నాల్గవ రోజు 'ముక్కనుమ' గా చెపుతారు. భోగి రోజున కుటుంబంలోని పెద్దలూ పిల్లలూ అందరూ కలసి ఉదయం వేళ కొయ్య దుంగలతో రోడ్లపై భోగి మంటలు వేస్తారు. తమ తమ ఇండ్లలోని, పనికిరాని పాత చెక్క వస్తువులను, ఇతర వస్తువులను మంటలలో పడవేసి, పనికిరాని పాతకు స్వస్తి చెప్పి కొత్త దనాన్ని కోరతారు. ఈ చర్య పాత చెడు అలవాట్లని మాని కొత్త మంచి అలవాట్లని చేసుకోవాలని కూడా సూచిస్తుంది. చాలా కుటుంబాలలో శిశువులకు, పిల్లలకు అంటే సాధారణంగా, మూడు సంవత్సరాల వయసు లోపు వారికి ఒక సాయంకాల వేడుకగా రేగిపండ్లు, పూవులు, చిల్లర నాణేలు కలిపి వారి తలపై పోసి ఆనందిస్తారు. దీనినే భోగి పండ్లు పోయటం అంటారు. రుచికరమైన తీపి పదార్థాలు తయారు చేసి అందరికి పంచుతారు. కుటుంబం లోని సభ్యులు ఎవరెవరు ఎక్కడ ఉన్నప్పటికీ, ఈ పండుగనాడు ఒకే చోట కలసి ఆనందిస్తారు. సోదరులు లేదా, తల్లి తండ్రులు, వివాహం అయిన తమ ఇంటి ఆడ పిల్లలని పండుగకు పిలిచి వారికి బట్టలు, బహుమానాలు పంచి వారి ప్రేమాప్యాయతలను చాటుకుంటారు. ఇంటి లేదా, దుకాణాల, రెండవ రోజు మకర సంక్రాంతి లేదా ' పెద్ద పండుగ'. అంటే ఇది పండుగలలో అన్నిటికంటే పెద్ద పండుగ అని అర్థం. ఈ రోజు అందరూ కొత్త దుస్తులు ధరిస్తారు, దేముని పూజిస్తారు, ఈ రోజున సూర్యుడు మకర రాశి లో ప్రవేశిస్తాడు. కనుక దీనిని మకర సంక్రమణం అని కూడా అంటారు. మరణించిన తమ పూర్వీకులకు సాంప్రదాయకంగా కొన్ని కర్మలను ఆచరిస్తారు. ఇంటిలో తయారు చేసిన పిండి వంటలతో కుటుంబ సభ్యులు అందరూ కలసి భోజనాలు చేస్తారు. మకర సంక్రాంతి పండుగ మూడవ రోజున, పశు పక్ష్యాదులను లను గుర్తు చేసుకుంటూ ప్రత్యేకించి ఆవులను, ఎద్దులను పూజిస్తారు. దీనిని కనుమ పండుగ లేదా పశువుల పండుగ అని కూడా అంటారు. ఈ రోజున ప్రయాణించటం అశుభంగా భావిస్తారు. ఈ రకంగా సంక్రాంతి పండుగలో తమ సంప్రదాయ, సాంస్క ృతిక విలువలు ప్రదర్శిస్తూ కొత్త మార్పులని ఆచరిస్తారు. గురువులు, తమ శిష్యులను ఆశీర్వదిస్తారు. ఇంటి పెద్ద కుటుంబంలోని సభ్యులకు దుస్తులు అందించి ఆశీర్వదిస్తారు. సంక్రాంతి పండుగ నాల్గవ రోజు ను 'ముక్కనుమ' అంటారు. సంక్రాంతి పండుగ మొదటి మూడు రోజులు కోస్తా ఆంధ్ర ప్రాంతంలోని ప్రజలు మాంసం లేదా చేపలు వంటి ఆహారాలు తినరు. కాని మూడవ రోజు అయిన కనుమనాడు ఆ పట్టింపు ఉండదు. తెలంగాణా ప్రాంతంలో ఈ పండుగ రెండు రోజులు మాత్రమే చేస్తారు. వీరు మొదటి రోజు నువ్వుల తో కలిపి వండిన అన్నాన్ని తిని, రెండవ రోజు అయిన పండుగనాడు మాంసం తింటారు. ఈ పండుగకు అన్ని కుటుంబాలు అరిసెలు, అప్పాలు వంటి పిండి వంటలు చేసి దేముడికి నైవేద్యం చేసి వారు తింటారు. ఈ పండుగకు దక్షిణ దేశపు ఆటలు అయిన కోడి పందేలు, ఆంధ్ర కోస్తా జిల్లాలలో ఆడగా, తమిళనాడు రాష్ట్రం లో ఎద్దుల పందేలు, కేరళ లో ఏనుగుల మేళా నిర్వహిస్తారు. ఈ పందేలలో చట్టబద్ధం కానప్పటికీ అధిక మొత్తాలలో పందేలు కాయటం ఈ ప్రాంతాలలో ఆనవాయతీగా వస్తోంది. ఈ పండుగ మరో ప్రత్యేకత పండుగ ఇంకా నెల రోజులు వున్నదనగానే, ప్రతి రోజూ ఉదయం వేళ రంగుల దుస్తులు ధరించి హరిదాసులు, గంగిరెద్దులు ప్రతి ఇంటి ముందుకు తెచ్చి ఇంటి వారికి ఆశీర్వాదాలు ఇచ్చి సొమ్ము అడుగుతారు. ఈ పండుగకు హైదరాబాద్, తెలంగాణ జిల్లాలలో పిల్లలు, పెద్దలు కలసి రంగు రంగుల గాలి పటాలు తమ భావ నాలపైకి ఎక్కి ఎగుర వేసి ఆనందిస్తారు. ఆంధ్ర దేశం తో పాటు, పొరుగునే కల కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలు కూడా ఈ పండుగను పొంగల్ పేరుతో ఆచరిస్తాయి. ఈ పండుగ రోజున ఉదయం వేళ ప్రతి ఇంట్లో ఈ సంవత్సరంలో కొత్తగా తాము పొందిన పంటలోని బియ్యాన్ని ఎంతో కృతజ్ఞతగా వండి పొంగలి తయారు చేసి సూర్యుడు కి నైవేద్యం చేసి తాము తింటారు. దక్షిణ భారత దేశం లో ఇది పెద్ద పండుగలలో ఒకటి. ఇండ్లను పూవులతో, రంగు రంగుల ముగ్గులతో అలంకరిస్తారు. కుటుంబం లో ప్రతి ఒక్కరూ కొత్త దుస్తులు ధరించి ఆనందిస్తారు. తమిళనాడు రాష్ట్రం లో పొంగల్ పండుగ మరియు, వారి కొత్త సంవత్సరం ఒకే రోజున వస్తాయి. మకర సంక్రాంతి పండుగను ఉత్తర భారత దేశం మరియు, మరికొన్ని ఇతర ప్రాతంలో...ఇతర రాష్ట్రాలలో లోరీ, బిహు,హడగా, పొకి,పొంగల్ మొదలైన పేర్లతో పంట కోతల పండుగగా చేస్తారు. తరతరాలుగా సంవత్సరం ఆరంభంలో వచ్చే ఈపండగకుఉన్న ప్రత్యేకత ముఖ్యంగా రైతుల కష్టానికి ఫలితంరావటం... అదే సమయంలో భూ మాతను, పశుపంపదను కొలువటం, ఆనవాయితీగా వస్తున్నది. అందుకే టాల్‌స్టాయి " హిందువు, మరియు హిందుత్వం ఒక రోజు ప్రపంచాన్ని శాసిస్తుంది. ఎందుకంటే ప్రజలతో మమైకం కావటమే" అంటాడు.



# గీతం అడ్మిషన్ల సమాచారం

సాగర్‌నగర్ : గీతం విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్‌లో 10 బి.టెక్ కోర్సులకు, ఇసిఇ మరియు మెకానికల్ ఇంజనీరింగ్‌లో 6 సంవత్సరాల డ్యూయల్ డిగ్రీ కోర్సులు (బి.టెక్+ఎమ్.టెక్,ఎమ్ఆర్క్ 17ఎమ్.టెక్ కోర్సులకు, బి.ఫార్మశి, ఎమ్.ఫార్మశి కోర్సులకు, ఐదేళ్ల బి.ఆర్క్ కోర్సుకు గ్యాట్-2018 ప్రవేశ పరీక్షను అఖిల భారత స్థాయిలో దేశంలోని 48 పట్టణాలలో ఆన్‌లైన్ విధానంలో పూర్తి చేసిన ధరఖాస్తులను 2018వ సంవత్సరం మార్చి 26వ తేది లోగా అందజేయవలసి ఉంటుందన్నారు. ఏప్రియల్ 5వ తేది నుంచి గీతం వెబ్‌సైట్ www.gitam.edu లో హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు.

గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ద్వారా నిర్వహిస్తున్న ఎంబిఎ లో ఫైనాన్స్, మార్కెటింగ్, హెచ్ఆర్, ఆపరేషన్స్ & సిస్టమ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లకు ప్రాక్టీస్ స్కూల్‌గా ఎంబిఎ (హెచ్ఆర్) కోర్సుకు అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారికి బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బిబిఎ), బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (మేనేజ్‌మెంట్ అకౌంటింగ్), బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బిజినెస్ అనలటిక్స్) కోర్సులకు ఐదేళ్ల ఎంబిఎ కోర్సుకు (ఇంటిగ్రేటెడ్), బికామ్ (ఆనర్స్) కోర్సుకు 2018 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ఆసక్తి గల విద్యార్థులు గీతం వెబ్‌సైట్ ఞఞఞ.స్త్రఱ్ణుఎ.వఎబ/స్త్రఱఎ ద్వారా దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

గీతం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ (జిఎస్ఐబి) నిర్వహిస్తున్న ఎమ్‌బిఎ ఇంటర్నేషనల్ బిజినెస్, ఎమ్‌బిఎ ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్, ఎమ్‌బిఎ గ్లోబల్ లాగిస్టిక్స్ అండ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలటిక్స్ కోర్సులలో ప్రవేశానికి గాను జిఎస్ఐబి ఎంట్రన్స్ టెస్ట్ (జెట్) నిర్వహిస్తున్నారు. దీనికి ఆన్‌లైన్‌లో ఞఞఞ.స్త్రంఱఎ.శీతీస్త్ర ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్ ద్వారా ఆంగ్ల భాషా, సాహిత్యాలపై ఎమ్.ఎ. ఇంగ్లీష్ పీజీ కోర్సును నిర్వహిస్తున్నారు. ఎమ్.ఎ.ఇంగ్లీష్ కోర్సుతో పాటు ప్రొఫెషనల్ ఇంగ్లీష్ కమ్యూనికేషన్ మరియు సాఫ్ట్ స్కిల్స్ ప్రోగ్రామ్, విదేశీ భాషలలో సైతం సర్టిఫికేట్ కోర్సులను స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్ ద్వారా నిర్వహిసున్నారు. ఈ కోర్సులలో ప్రవేశం పొందడానికి ఆసక్తిగల విద్యార్థులు గీతం విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ గాంధియన్ స్టడీస్‌ను సంప్రదించవచ్చు. అదనపు సమాచారం కోసం అడ్మిషన్ల డైరక్టర్‌ను 9705748318, 7207361878 నంబర్లలలో సంప్రదించవచ్చు. గీతం విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా ద్వారా ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఐదేళ్ల బిబిఎ, ఎల్ఎల్‌బి మరియు బిఎ, ఎల్ఎల్‌బి కోర్సులలో 2018 సంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నారు. అలాగే డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు మూడేళ్ల ఎల్ఎల్‌బి కోర్సులో ప్రవేశాలు నిర్వహిస్తున్నారు. జాతీయ స్థాయిలో జరిగే కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్-2018) లో ర్యాంకు ఆధారంగా ఈ ప్రవేశాలు ఉంటాయి.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com